
ఈనాడు ETV ఆధ్వర్యంలో... గర్భకోశ, గుండె సంబంధిత, సాధారణ అనారోగ్య సమస్యలపై రేపు అవగాహన సదస్సు



'ఈనాడు - ఈటీవీ' ఆధ్వర్యంలో స్త్రీ గర్భకోశ, గుండె సంబంధిత, సాధారణ అనారోగ్య సమస్యలపై ఈనెల 27న ఏలూరులో అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. గుండె వ్యాధులకు సంబంధించి ఎలాంటి లక్షణాలు ఉంటాయి. గుండెపోటు వచ్చే ముందు ఇబ్బందులు, గ్యాస్ట్రిక్, గుండెనొప్పికి మధ్య తేడాలు.. స్త్రీలలో గర్భకోశ సమస్యలు, దీర్ఘకాలిక సాధారణ అనారోగ్య సమస్యలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్లు, వ్యాయామం, పాటించాల్సిన జాగ్రత్తలపై వైద్యులు ప్రత్యక్షంగా అవగాహన కల్పిస్తారు. సదస్సుకు హాజరయ్యేవారు తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. - న్యూస్‌టుడే, ఏలూరు టూటౌన్

ప్రవేశం ఉచితం

తేది: అక్టోబర్ 27, ఆదివారం | సదస్సు వేదిక: మర్చంట్ ఛాంబర్ వారి శ్రీసీతారామ భర్తియ కల్యాణ మండపం, జనార్దనరావు హాల్, అగ్రహారం, ఏలూరు | సమయం: ఉదయం 10.30 నుంచి 12.30 గంటల వరకు.

శిరస్త్రాణం ధరించకుంటే జరిమానా: కలెక్టర్


మాట్లాడుతున్న వెట్రిసెల్వి

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహన చోదకులు శిరస్త్రాణం ధరించకుంటే అపరాధ రుసుము తప్పదని కలెక్టర్ కె.వెట్రి సెల్వి, ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ హెచ్చరించారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. సురక్షిత ప్రయాణానికి ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలన్నారు. ఏలూరులోని వట్లూరు, అన్నమాచక కూడలి, సీఆర్ఆర్ పాఠశాల తదితర ప్రాంతాల్లో శనివారం తనిఖీలు నిర్వహించి శిరస్త్రాణం ధరించని చోదకులకు అపరాధ రుసుము విధిస్తామన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలు పడిన రహదారులకు మరమ్మతులు చేయించాలని వారు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఇన్‌ఛార్జి డీటీసీ కృష్ణంరాజు, ఆర్డీవో అచ్యుత్ అంబరీశ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇంటింటికీ ఇంకుడు గుంత!

జిల్లాలో 20 వేల నిర్మాణాల లక్ష్యం



కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: భూగర్భ జలాలకు ఊపిరినిచ్చేలా, నింగి నుంచి కురిసే ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టేలా కూటమి ప్రభుత్వం కార్యాచరణకు సిద్ధమైంది. ఇళ్ల పరిసరాల్లో వర్షపు నీరు, వాడుక నీరు భూమిలోకి ఇంకేలా వ్యక్తిగత ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. జిల్లాలోని 20 మెట్ట మండలాల్లో 20వేల గుంతల లక్ష్యాన్ని నిర్దేశిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఇటీవల మార్గదర్శకాలు జారీ చేసింది.

మార్గదర్శకాలు ఇలా..
- ఇంకుడు గుంతల లోతు: 1.20 మీటర్లు
- నిర్దిష్ట పరిమాణంలోని కంకర/మెటల్ రాళ్లు: అయిదంచెల్లో వినియోగించాలి
- కూలీ వేతనం: రూ.550.
- సామగ్రి కొనుగోలుకు రూ.5450

ఒక్కో యూనిట్‌కు ఉపాధి హామీ పథకం నిధులు రూ.6వేల చొప్పున మొత్తం రూ.12 కోట్లు వెచ్చించనున్నారు.

మండలానికి 2500

'ఇంకుడు గుంతల నిర్మాణం మండలానికి 2500 లక్ష్యంగా నిర్దేశించాం. నవంబరు ఆఖరుకు నిర్మాణాలు పూర్తి చేయాలని కార్యాచరణ రూపొందించాం' అని డ్వామా పీడీ కేవీ సుబ్బారావు తెలిపారు.

ఉపయోగాలిలా..

గ్రామాల్లో పలు చోట్ల డ్రెయిన్ల సదుపాయం లేక వర్షపు, ఇళ్లలోని వాడకం నీరు వృథాగా రహదారులపై చేరుతోంది. అవన్నీ ఇంకుడు గుంతల్లో చేరేలా నిర్మాణాలు చేపట్టనున్నారు. తద్వారా ఇళ్ల వద్ద మురుగు సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. భూగర్భ జలాల పెరుగుదలకు దోహదపడుతుంది.

అరకొర భత్యం.. అవస్థలు నిత్యం

- దివ్యాంగుల భవితకేదీ భరోసా
- నిలిచిన ఆట వస్తువుల సరఫరా
- ఇరుకు గదుల్లో ఇక్కట్లు

ఈనాడు, ఏలూరు, న్యూస్‌టుడే-బుట్టాయగూడెం, కైకలూరు, ముదినేపల్లి

దివ్యాంగులను విభిన్న నైపుణ్యాలతో ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ప్రవేశపెట్టిన భవిత కేంద్రాలు సౌకర్యాల లేమితో కునారిల్లుతున్నాయి. చాలీచాలని ఇరుకు గదుల్లో బోధన సాగుతోంది. ఆట వస్తువుల సరఫరాలోనూ గత ప్రభుత్వ వైఫల్యాలు వెక్కిరిస్తున్నాయి. అటు ప్రయాణ భత్యాలూ అరకొరగా అందుతున్నాయి.


బుట్టాయగూడెం భవిత పాఠశాలలో మూలకు చేసిన బోధన పరికరాలు

కేంద్రం నిధులతో రాష్ట్ర ప్రభుత్వం సమగ్రశిక్షా ద్వారా పాఠశాలలను నిర్వహిస్తోంది. గతంలో ప్రత్యేకంగా కేంద్రాల్లో నిర్వహించేవారు. ఈ కేంద్రాల్లో 21 రకాల వైకల్యాలు ఉన్న వారు చదువుకునేందుకు అవకాశం ఉంది. మధ్యాహ్న భోజన పథకం అందకపోవటం..క్రీడా మైదానాలు అందుబాటులో లేకపోవటం..సాధారణ విద్యార్థులతో మమేకమవడం కోసం ఉన్నత పాఠశాలలకు మార్చాలని ఆదేశాలొచ్చాయి. నాడు-నేడులో వీరి ప్రత్యేకంగా గదులు కూడా నిర్మాణం చేపట్టాల్సి ఉన్నా పనులు ముందుకు సాగలేదు. దీంతో మొత్తం 28 పాఠశాలల్లో 11 మాత్రమే ఉన్నత పాఠశాలల్లోకి మార్చారు. మిగిలిన 17 ప్రాథమిక పాఠశాలలోనే నిర్వహిస్తున్నారు. ఏలూరు అశోక్‌నగర్‌లోని కేంద్రం సుబ్బమ్మదేవి పాఠశాలలోకి మార్చాలని ఆదేశాలున్నా అక్కడ గదుల్లేవు.

ముదినేపల్లి భవిత కేంద్రంలో మధ్యాహ్న భోజనం అందించేందుకు ఇబ్బందిగా ఉండటంతో ఆరు నెలల క్రితం ఖాళీ చేసి ఉన్నత పాఠశాలలోకి మార్చారు. ఒకే గదిలో ఇక్కడ 20 మంది విద్యార్థులు, పరికరాలు ఉండటంతో ఇరుకుగా ఉంది. మరుగుదొడ్లకు వెళ్లేందుకు ర్యాంపు సౌకర్యం లేక దివ్యాంగులకు అవస్థలు తప్పటం లేదు.

- ఏలూరు శనివారపుపేటకు చెందిన ఓ విద్యార్థిని ఆమె తల్లి రోజూ అశోక్‌నగర్ భవిత పాఠశాలకు ఆటోలో తీసుకువెళతారు. ప్రయాణాలకు నెలకు రూ.3వేలు ఖర్చవుతోంది. ప్రభుత్వం ఏడాదికి రూ.3వేలు మాత్రమే ఇస్తోంది. దీంతో పెద్ద ఎత్తున ఆర్థిక భారం పడుతోంది.
- నిబంధనల ప్రకారం విద్యార్థులను ఉపాధ్యాయులే పాఠశాలకు తీసుకువెళ్లి తీసుకురావాలి. జిల్లా వ్యాప్తంగా దాదాపు ఎక్కడా ఇలా చేయడం లేదు. అసక్తి ఉన్న తల్లిదండ్రులు మాత్రమే పిల్లలను పాఠశాలలకు తీసుకువస్తున్నారు. మిగిలిన వాళ్లు ఇళ్లకే పరిమితమవుతున్నారు.

పరిమిత సదుపాయాలతో ఇబ్బందులు

బోధన పరికరాల సరఫరా నిలిచిపోయింది. బుట్టాయగూడెం కేంద్రంలో చాలా పరికరాలు మూలకు చేరగా మిగిలిన వాటినే వాడుకుంటున్నారు. గతంలో తాగునీరు, విద్యుత్తు ఛార్జీలు, మరుగుదొడ్ల నిర్వహణ తదితర మౌలిక సదుపాయాల కోసం ఒక్కో కేంద్రానికి ఏడాదికి రూ.10వేలు మంజూరు చేసేవారు. వైకాపా ప్రభుత్వం వీటికీ నీళ్లొదిలింది. కైకలూరులో ఉపాధ్యాయులు సొంత నిధులు వాడుతున్నారు. దీనిపై భవిత కేంద్రాల జిల్లా సహిత సమన్వయకర్త భాస్కర్ మాట్లాడుతూ.. భత్యాలు సకాలంలో జమ చేస్తామని.. పాఠశాలలను త్వరలోనే ఉన్నత పాఠశాలల్లో నిర్వహిస్తామని తెలిపారు.


ముదినేపల్లిలో ఇరుకుగదిలో నిర్వహిస్తున్న భవిత కేంద్రం

చాలీచాలని ప్రయాణ ఖర్చులు

అసలే చాలీ చాలని ప్రయాణ భత్యాలు. వీటికి కూడా వైకాపా సర్కారులో కోతలు తప్పలేదు. కైకలూరులో పదిమందిలో ఏడుగురికి నగదు జమ కాలేదు. ఇలా ప్రతి పాఠశాలలో ప్రయాణ భత్యాలు జమకాని వారున్నారు.

- జిల్లాలో భవిత కేంద్రాలు సంఖ్య: 28
- మొత్తం విద్యార్థులు: 560
- మొత్తం 52 ఉపాధ్యాయులు
- ఉన్నత పాఠశాలల్లో నిర్వహిస్తున్న కేంద్రాలు: 11
- ప్రాథమిక పాఠశాలల్లో నిర్వహిస్తున్నవి 17

శరణాగతి.. గరుడా చలపతి


శ్రీవారి గరుడ వాహన సేవ

వాడపల్లి(ఆత్రేయపురం), న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లిలో శ్రీవేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం గరుడోత్సవం కనులపండువగా జరిగింది. మలయప్పస్వామి మకరకంఠి, లక్ష్మీహారం వంటి విశేష తిరువాభరణాలు ధరించి గరుత్మంతుడిపై దేదీప్యమానంగా వెలుగొందుతూ భక్తులకు ఆశీస్సులు అందించారు. గరుడ వాహనం ద్వారా స్వామివారు దాసానుదాస ప్రపత్తికి తాను దాసుడనని చెబుతారు. జ్ఞాన వైరాగ్య ప్రాప్తి కోరే మానవులు గరుడను దర్శిస్తే సర్వపాపాలు తొలుగుతాయని భక్తకోటికి సందేశాన్నిచ్చారు. తొలుత నదీ జలాల సంగ్రహణం, మహాస్నపనం, లక్ష కుంకుమార్చన, మహాలక్ష్మి హోమం తదితర కార్యక్రమాలను అర్చకులు రమణీయంగా జరిపించారు. శనివారం మహాపుష్పయోగం, సూర్య చంద్రప్రభ వాహన సేవ, సహస్రదీపాలంకరణ సేవ ఉంటాయి.


స్నపన తిరుమంజనం

12,040 టన్నుల ధాన్యం కొనుగోలు

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో 12,040 టన్నుల ఖరీఫ్ ధాన్యం కొనుగోలు చేసినట్లు సంయుక్త కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. ఉంగుటూరు మండలం చేబ్రోలు రైతు సేవా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం ద్వారా రూ.2.76 లక్షలు విలువైన ధాన్యం కొనుగోలు చేశామన్నారు. రైస్ మిల్లరు రసీదు ఇచ్చిన 48 గంటల్లోపు రైతు ఆధార్ అనుసంధాన బ్యాంకు ఖాతాలో సొమ్ము జమ చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 39.10 లక్షల నాణ్యమైన గోనె సంచులు రైతు సేవా కేంద్రాలకు పంపేందుకు సిద్ధంగా ఉంచామన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే, 77020 03584 లేదా టోల్‌ఫ్రీ 1800425 6453 నంబర్లను సంప్రదించాలని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఫోన్ పోయిందా..కాల్ చేయండి

..ట్రోల్‌ఫ్రీ నంబరు 9550351100

తాజాగా 154 చరవాణులు స్వాధీనం ఎస్పీ


చరవాణులను పరిశీలిస్తున్న ప్రతాప్ శివకిశోర్, సూర్యచంద్రరావు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: వివిధ ప్రాంతాల్లో చోరీలకు గురైన 154 చరవాణులను ఏలూరు జిల్లా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీసు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ వివరాలు వెల్లడించారు. 13వ దఫాగా రూ.21,56,000 విలువైన 154 చరవాణులు స్వాధీనం చేసుకున్నామన్నారు. బాధితుల సౌకర్యార్థం టోల్‌ఫ్రీ నంబరు 9550351100 అందుబాటులో ఉంచామన్నారు. బాధితులు ఈ నంబరుకు సమాచారం అందించగా- మరికొందరు నేరుగా ఫిర్యాదు చేయడంతో ఏలూరు సీసీఎస్, సైబర్ సెల్ పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు చేపట్టి చరవాణులు రికవరీ చేశారన్నారు. ఐఎంఈఐ నంబర్ల ద్వారా వాటిని కనుగొని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఉభయ రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు చెందిన బాధితుల చరవాణులు రికవరీ చేశామన్నారు. అంతకుముందు 12 దఫాలుగా 1606 చరవాణులు రికవరీ చేశామని, వాటి విలువ సుమారు రూ.3,11,83,684 ఉంటుందన్నారు. అనంతరం పలువురు బాధితులకు ఎస్పీ చరవాణులు అందజేశారు. సమావేశంలో అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, సీసీఎస్ సీఐ రాజశేఖర్, సైబర్ సెల్ సీఐ గోపాలకృష్ణ, ఎస్సై మధురాజా, సిబ్బంది పాల్గొన్నారు.

జాగా లేకున్నా విక్రయం

- ఒకే ఆస్తి ఇద్దరికి రిజిస్ట్రేషన్
- బరి తెగిస్తున్న రియల్టర్లు!

జంగారెడ్డిగూడెం, తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లోని పలు పట్టణాల్లో స్థలాలు, స్థిరాస్తి విక్రయాల్లో మోసాలు పెరిగిపోయాయి. కొందరు డబుల్ రిజిస్ట్రేషన్లతో మోసగిస్తుంటే, మరికొందరు నకిలీ పత్రాలు, డాక్యుమెంట్లతో బురిడీ కొట్టిస్తున్నారు. పక్క సర్వే నంబర్లు వేసి ఓ స్థలాన్ని ఇద్దరు, ముగ్గురికి అమ్మడం, అసలు స్థలాలే లేకుండా తప్పుడు రిజిస్ట్రేషన్ల ద్వారా డాక్యుమెంట్లు సృష్టించి మోసగిస్తున్నారు.

అసలు స్థలం లేకుండానే..

జంగారెడ్డిగూడెం బస్టాండ్ వెనుక ప్రాంతంలో కరోనా సమయంలో ఓ వ్యాపారి సుమారు రూ.30 లక్షలతో 250 గజాల స్థలం బాగా తెలిసిన వ్యక్తి వద్ద కొనుగోలు చేశారు. తీరా చూస్తే అక్కడ స్థలం లేదు.

పూర్వార్జితం అంటూ.. పేరంపేట రోడ్డులో ఓ వ్యక్తి తన పూర్వార్జితం అంటూ స్థలం లేకుండానే అమ్మేశాడు. తొలుత కుటుంబ సభ్యుల పేరున రిజిస్టర్ చేసినట్లు సమాచారం. ఆ తరువాత ఆ డాక్యుమెంట్ చేతులు మారింది. తాజాగా కొన్న వ్యక్తి.. డాక్యుమెంట్ ఆధారంగా జన బలంతో ఓ దుకాణం వద్ద సామగ్రి బయట వేసి స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఆ భవన నిర్మాణ దారులు ఆ వ్యక్తిని బయటకు నెట్టారు.



ధరలు భారీగా పెరగడంతో..

స్థలాల ధరలు భారీగా పెరగడంతో మోసాలకు పాల్పడే వారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది. కొనుగోలుదారులు అప్రమత్తంగా లేకుంటే మోసపోవడం ఖాయం. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలే కేంద్రంగా మోసాలకు తెగబడుతున్నారు. తప్పు సర్వే నంబర్లు వేసినా కొందరు కాసులకు కక్కుర్తి పడి రిజిస్ట్రేషన్లు చేసేస్తున్నారు. వివాదాస్పద డాక్యుమెంట్లను ఇతర పట్టణాల్లో రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నారు. అక్రమార్కులపై కొరడా ఝుళిపించకుంటే భవిష్యత్తులో భూ వివాదాలు పెరిగే ప్రమాదం ఉంది.

నంబరుకు /1 వేసి..

జంగారెడ్డిగూడెం పద్మా థియేటర్ ఎదురుగా ఓ వ్యాపారి అనధికార లేఅవుట్ వేశారు. అందులో సుమారు 200 గజాల స్థలాన్ని ఇద్దరికి విక్రయించారు. మొదటి సారి అసలు సర్వే నంబరుతో రిజిస్ట్రేషన్ చేశారు. రెండోసారి ఆ నంబరుకు/1 చేర్చి మరొకరికి కట్టబెట్టారు. కొనుగోలుదారుల్లో ఒకరు ఇటీవల ఇల్లు కట్టుకునేందుకు స్థలం బాగు చేస్తుండగా.. రెండో వ్యక్తి వచ్చి అది తనదని గొడవ చేశాడు. ఆ తరువాత రెండు డాక్యుమెంట్లు పరిశీలించగా.. వ్యాపారి చేతిలో మోసపోయినట్లు తెలుసుకున్నారు. దీంతో బాధితులు కొద్ది రోజుల కిందట స్థానిక నేత ఒకరి వద్ద పంచాయితీ పెట్టారు. విషయం తెలుసుకున్న వ్యాపారి ఊరు నుంచి ఉడాయించాడు.

ఇద్దరికి అమ్మేశారు..

తాడేపల్లిగూడెంలో ఓ స్థిరాస్తి వ్యాపారి కడకట్ల ప్రాంతంలో లేఅవుట్ వేశారు. ఇందులో సుమారు 200 గజాల స్థలాన్ని ఓ దుకాణదారు కొన్నాడు. అదే స్థలాన్ని రెండేళ్ల అనంతరం హైదారాబాద్‌కు చెందిన మరో మహిళకు అమ్మారు. ఇటీవల మొదట కొన్న దుకాణదారుడు ఇల్లు కట్టుకోవడానికి చదును చేయిస్తుంటే మహిళ వచ్చి అడ్డుపడింది. అమ్మిన వ్యక్తికి దగ్గరకు వెళితే సరైన సమాధానం లేదు. దీంతో బాధితులు గగ్గోలు పెడుతున్నారు.

గుంతల మధ్య రోడ్డు!


వానొస్తే ఇదే తీరు...కలిదిండి మండలం కోరుకొల్లు - సానారుద్రవరం మార్గంలో


ముదినేపల్లి మండలం శ్రీహరిపురం వద్ద ధ్వంసమై...

కలిదిండి, ముదినేపల్లి, న్యూస్‌టుడే : రోడ్డు మధ్యలో గుంతలు పడటం సహజమే. కానీ.. గుడివాడ - భీమవరం మార్గంలో గుంతల మధ్యలో అక్కడక్కడా రోడ్డు కనిపిస్తోంది. గత పాలకుల నిర్లక్ష్యానికి, అధికారుల అలసత్వానికి ఈ రోడ్డులోని ప్రతి గొయ్యి సాక్ష్యంగా నిలుస్తోంది. ముదినేపల్లి నుంచి కలిదిండి శివారు ఉప్పుటేరు వరకు రోడ్డు నిర్మాణానికి 10 నెలల కిందటే రూ.4 కోట్లు మంజూరయ్యాయి. కానీ పనులు మాత్రం ప్రారంభించలేదు. గుత్తేదారుకు ఇతర పనులకు సంబంధించి పాత బకాయిలు మంజూరు కాకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని అధికారులు చెబుతున్నారు.

- రహదారి : ముదినేపల్లి - కలిదిండి
- మొత్తం పొడవు : 29 కి.మీ
- నిర్మించాల్సినది : 7.4కి.మీ (10 నెలల కిందట గుర్తించినది)
- రోజూ ప్రయాణికుల సంఖ్య : 90 వేలు

జాతీయ పశు గణన సర్వే ప్రారంభం

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లాలో జాతీయ పశు గణన సర్వే శుక్రవారం ప్రారంభమైందని కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. స్థానిక కలెక్టర్ విడిది కార్యాలయంలో పశుగణన సర్వే గోడపత్రాలను వెట్రిసెల్వి ఆవిష్కరించి మాట్లాడారు. పశుగణన సర్వే ప్రక్రియలో భాగంగా ఇప్పటికే సిబ్బందికి శిక్షణ పూర్తయిందన్నారు. వీరు వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు పశు గణన నిర్వహిస్తారన్నారు. 27 మండలాలకు 27 మంది ఎన్యూమరేటర్లు, 53 మంది పర్యవేక్షకులు సర్వేలో పాల్గొంటారన్నారు. జిల్లాలో పశువులు, పెంపుడు జంతువులు, గొర్రెలు, మేకలు, ఆవులు, ఎద్దులు, కోళ్లు ఎన్ని ఉన్నాయో ఇంటింటికీ వెళ్లి పక్కాగా వివరాలు సేకరించాలని ఆదేశించారు.

చిక్కని చిరుత


బోనును పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

భీమడోలు, న్యూస్‌టుడే: భీమడోలు, ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లి పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్న చిరుతను పట్టుకునేందుకు అటవీ అధికారులు చేస్తున్న ప్రయత్నాలన్నీ విఫలమవుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో చిరుత సంచరిస్తున్న దృశ్యాలు శుక్రవారం సైతం నిఘా కెమెరాల్లో నిక్షిప్తం కాలేదు. బోన్లకూ చిక్కకపోవడంతో స్థానికుల్లో భయాందోళన నెలకొంది. ఇదిలా ఉండగా... పెదవేగి మండలంలో చిరుత సంచరిస్తోందని చెబుతున్న అధికారులు.. దాన్ని పట్టుకునేందుకు మాత్రం భీమడోలు పరిసరాల్లో బోన్లు ఏర్పాటు చేయడం గమనార్హం. రేంజర్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది బృందాలుగా ఏర్పడి రాత్రింబవళ్లు ప్రత్యక్ష నిఘా కొనసాగిస్తున్నారు.

తీరనున్న కొండరెడ్ల కష్టాలు!

మారుమూల గ్రామాల్లో బహుళ ప్రయోజన భవనాలు


చెట్టు కింద సమావేశమైన కొండరెడ్డి తెగ గిరిజనులు

మండలాలు: బుట్టాయగూడెం, పోలవరం

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: ఏదైనా సమావేశం నిర్వహించుకోవాలన్నా.. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ.. చివరకు వైద్య సేవలు పొందేందుకు శాశ్వత భవన సదుపాయం లేక దశాబ్దాలుగా మన్యంలోని మారుమూల అటవీ ప్రాంతాల్లో నివసించే కొండరెడ్డి తెగ గిరిజనులు అవస్థలు పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి జన్‌మన్ పథకంతో వీరి కష్టాలు తీరనున్నాయి. ఇందులో భాగంగా బహుళ ప్రయోజన కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఆరోగ్య ఉపకేంద్రం, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం తదితరాలను ఒకే చోట నిర్వహించాలనేది ప్రధాన ఉద్దేశం. కేంద్రాలకు ప్రత్యేక భవనాలు నిర్మించనున్నారు. రాష్ట్రంలో 125 మంజూరు కాగా.. రూ.75 కోట్లు కేంద్రం విడుదల చేసింది. వీటిలో 72కి టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు. తాజాగా మరో 53 భవనాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం పాలనా పరమైన అనుమతులిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా ఏలూరు జిల్లా మన్యంలో ఒక్కోటి రూ.60 లక్షల అంచనాతో 16 కేంద్రాలకు భవనాలు నిర్మిస్తారు. వీటిని కేఆర్‌పురం ఐటీడీఏలోని గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ విభాగం అధికారుల పర్యవేక్షణలో పూర్తిచేస్తారు. టెండర్ల ప్రక్రియ పూర్తి కాగానే పనులు చేపడతామని ఈఈ టి.లత తెలిపారు.

భవనాలు మంజూరైన గ్రామాలు: నాగన్నగూడెం, ఉప్పరిల్ల, తంగేడుకొండ, రేపల్లి, లంకపాకల, గొట్టాలరేవు, రేగులపాడు, రెడ్డిబొడ్డేరు, మోతుగూడెం, తానిగూడెం, రామనర్సాపురం, వీరన్నపాలెం, వేరుమద్దిగూడెం, చిలకలూరు, ఉడతపల్లి, కల్లుమామిడి

పూర్తిగా ఆన్‌లైన్లోనే

పంచాయతీల్లో ఆడిట్

ఈనాడు డిజిటల్, భీమవరం: గ్రామ పంచాయతీలు, మండల పరిషత్తుల్లో 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఆన్‌లైన్ ఆడిట్ ప్రారంభమైంది. ఆయా పంచాయతీల ఆదాయ, వ్యయాలపై అధికారులు లెక్కలు తీస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో చేసిన ఖర్చులు, వాటికి సంబంధించిన బిల్లులు, ఓచర్లను పరిశీలిస్తున్నారు.

నవంబరు నెలాఖరుకు

గ్రామ పంచాయతీల అభివృద్ధికి కేంద్రం విడుదల చేసే నిధులను సైతం గత వైకాపా ప్రభుత్వం పక్కదారి పట్టించడంతో కేంద్రం పలు విధానాలను అమల్లోకి తెచ్చింది. అందులో భాగంగా ఈ ఏడాది ఆడిట్‌ను పూర్తిస్థాయిలో ఆన్‌లైన్‌లో నిర్వహించేలా చర్యలు చేపట్టింది. పంచాయతీలు ఏ మాత్రం అలసత్వం ప్రదర్శించి ఆడిట్‌ను నిర్వహించకపోయినా తదుపరి అభివృద్ధి, ఆర్థిక సంఘం నిధులు పంచాయతీల ఖాతాల్లో జమకావని హెచ్చరించింది. షెడ్యూలు ప్రకారం నవంబరు చివరి నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంది. పూర్తిస్థాయిలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ విభాగాల ఆడిట్‌ను డిసెంబరు 31 నాటికి పూర్తిచేస్తారు. వ్యయాలపై అభ్యంతరాలుంటే వాటిని పరిష్కరించడానికి మూడు నెలల సమయం అనంతరం తుది నివేదికను మార్చిలో ఉన్నతాధికారులకు సమర్పించనున్నారు.



గతానికి భిన్నంగా

గతంలో మాన్యువల్‌గా జరిగిన ఆడిట్ ప్రక్రియ ఈ ఏడాది పూర్తిస్థాయిలో ఆన్‌లైన్‌లో చేపడుతున్నారు. రికార్డులను సరిచూసిన అనంతరం వాటిని నేరుగా నమోదు చేస్తున్నారు.

అలసత్వం వహిస్తే నిధులు రావు

ఉమ్మడి జిల్లాలో 1064 పంచాయతీల్లో 65శాతం ఆన్‌లైన్ ప్రక్రియ ముగిసింది. ఆడిట్ దస్త్రాల సమర్పణలో పంచాయతీ అధికారులు ఏ మాత్రం అలసత్వం ప్రదర్శించినా తదుపరి అభివృద్ధి నిధులు రావని జిల్లా ఆడిట్ అధికారి గంగాధరరావు వాపోయారు.

ఇక ఒకటో తరగతి నుంచీ అపార్

నమోదు తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యార్థుల కోసం కేంద్రం అమలు చేస్తోన్న జీవితకాల, ప్రత్యేక 12 అంకెల గుర్తింపు వ్యవస్థ అపార్(ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) ఇకపై ఒకటో తరగతి నుంచీ తప్పనిసరి చేస్తూ జిల్లా విద్యాశాఖ శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది.

ఆధార్ కీలకం

అపార్ గుర్తింపు సంఖ్య నమోదుకు ఆధార్ కార్డు కీలకం. పాఠశాలల్లో నమోదైన వివరాలకు, ఆధార్ వివరాలకు సరిపోలని పక్షంలో వాస్తవమైన వివరాలను నవీకరించుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ ఆధార్ వివరాల్లో మార్పులు అవసరమైతే ఆ మేరకు ఆయా కేంద్రాల్లో సరి చేయించుకునే వెసులుబాటు ఉంది. పాఠశాల వివరాల్లో మార్పులకు సంబంధిత అధికారులను సంప్రదించాలి. ఇప్పటికే 9,10తరగతుల విద్యార్థులకు అపార్ గుర్తింపు సంఖ్య నమోదు ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో తాజాగా ఒకటో తరగతి నుంచి పదోతరగతి వరకు రోజుకు కనీసం 500మందికి అపార్ గుర్తింపు సంఖ్యలను నమోదు చేయించాలని లక్ష్యంగా నిర్దేశించారు.

జిల్లాలో విద్యార్థుల వివరాలు

తరగతులు	ప్రభుత్వ	ప్రైవేటు	మొత్తం
ప్రాథమిక	38922	25826	64748
ప్రాథమికోన్నత	17199	23349	40548
ఉన్నత	81020	81125	162145

బాణసంచా దుకాణాలకు అనుమతులు తప్పనిసరి : కలెక్టర్

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో బాణసంచా దుకాణాలు ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతులు పొందాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో బాణసంచా దుకాణాల అనుమతులు, భద్రతా చర్యలపై శుక్రవారం సమీక్షించారు. బాణసంచా విక్రయ కేంద్రాల వద్ద తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. సురక్షిత ప్రాంతాల్లో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఏలూరు ఇండోర్ మైదానంతోపాటు దుకాణాలు ఏర్పాటు చేసే ప్రాంతాల్లో రెండేసి ప్రవేశ మార్గాలుండేలా చూడాలని ఆదేశించారు. రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు బాణసంచా అమ్మకాలు నిషేధమన్నారు. ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ మాట్లాడుతూ.. అనుమతులకు మించి బాణసంచా సామగ్రి తయారు చేసినా, నిల్వ ఉంచినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా అగ్నిమాపక అధికారి, ఆర్డీవో అచ్యుత్ అంబరీశ్, డీఎస్పీ శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అపార్ నమోదు వేగవంతం.. **ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే:** జిల్లాలో విద్యార్థులందరికీ 'ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ' (అపార్) గుర్తింపు సంఖ్యల నమోదును వేగవంతం చేసేలా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. అమరావతి నుంచి పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి కె.శశిధర్ శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో దూర దృశ్య సమావేశం నిర్వహించారు. అపార్ గుర్తింపు సంఖ్యల నమోదు, మెగా డీఎస్సీకి సంబంధించిన రోస్టర్ పాయింట్ల ఖరారు తదితరాలపై సమీక్షించారు. ఏలూరు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు అపార్ గుర్తింపు సంఖ్యలిచ్చే ప్రక్రియను త్వరలోనే పూర్తి చేస్తామని ఆమె పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం: ఎస్పీ

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: పోలీసు శాఖ విలువైన సేవలందించి.. అనారోగ్యం, ఇతర కారణాలతో మృతి చెందినవారి కుటుంబాలను ఆదుకుంటామని ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాల సందర్భంగా ఎస్పీ కార్యాలయ సమావేశ మందిరంలో పోలీసు కుటుంబాలతో శుక్రవారం సమావేశమయ్యారు. అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావుతో కలిసి ఆర్థిక పరమైన అంశాలు, శాఖాపరంగా రావాల్సిన రాయితీలు, ఇతర సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబ సభ్యుల్లో ఎందరు కారుణ్య నియామకాలకు దరఖాస్తు చేసుకున్నారో తెలుసుకున్నారు. భీమవరం యూనిట్ హోంగార్డు నాగేశ్వరరావుకు సంక్షేమ నిధి నుంచి రూ.5,31,080 చెక్కు అందజేశారు.

పోలీసుల సంక్షేమానికి పెద్దపీట.. **ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే:** శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడుతున్న పోలీసుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ అన్నారు. స్థానిక ఎస్పీ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం పోలీసు సంక్షేమ దివస్ నిర్వహించారు. శాంతిభద్రతలు, ఏఆర్, ప్రత్యేక బృందాల పోలీసులు, హోంగార్డులు తమ సమస్యలపై ఎస్పీకి వినతిపత్రాలు అందజేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతానని ఎస్పీ హామీ ఇచ్చారు. ఎలాంటి ఇబ్బందులు, ఒత్తిళ్లు లేకుండా ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఆయన సూచించారు.

ఏపీ జేఏసీ అమరావతి మహిళా కమిటీల ఎన్నిక

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: స్థానిక రెవెన్యూ భవన్‌లో ఏపీ జేఏసీ అమరావతి ఏలూరు, జంగారెడ్డిగూడెం డివిజన్ మహిళా కమిటీలను శుక్రవారం ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా సంఘ రాష్ట్ర మహిళా విభాగం చైర్‌పర్సన్ పి.లక్ష్మీ హాజరయ్యారు. సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షుడు కె.రమేష్ కుమార్ ఆధ్వర్యంలో కమిటీల ఎన్నికలు నిర్వహించారు. మల్లేశ్వరి, రమాదేవి, ఎన్.రోజా, బి.లక్ష్మి, సత్యవేణి, ఆదిలక్ష్మి, వి.ధనలక్ష్మి, వీవీ రమాదేవి, పార్వతి, కె.హారిక, పి.సుజన ఎన్నికయ్యారు. వారితో ప్రతిజ్ఞ చేయించారు. పి.లక్ష్మి మాట్లాడుతూ... మహిళా ఉద్యోగులు పనిచేసే కార్యాలయాల్లో కనీస సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.



నూతన నాయకులతో సంఘ ప్రతినిధులు

బెదరగొట్టి.. కొల్లగొట్టి!

సైబర్ మాయగాళ్లతో జాగ్రత్త

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే

సైబర్ మోసాలకు గురవుతున్న బాధితుల సంఖ్య పెరుగుతూనే ఉంది. విద్యావంతులు సైతం మోసగాళ్ల వలలో చిక్కుకుంటున్నారు. వీరిలో కొందరు మాత్రమే పోలీసులను ఆశ్రయిస్తున్నారు. బయటకు చెప్పుకోలేక కొందరు, ఫిర్యాదు చేసినా ప్రయోజనం ఉండదనే భావనతో ఇంకొందరు పోలీస్‌స్టేషన్ గుమ్మం తొక్కడంలేదు. గత నాలుగేళ్లలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 143 కేసులు నమోదయ్యాయి. ఫిర్యాదు వరకు రానివి.. వచ్చినా కేసులు నమోదు చేయడానికి ఇంతకు మూడు, నాలుగు రెట్లు అధికంగా ఉంటాయనడంలో సందేహం లేదు.

❖ భీమవరానికి చెందిన ఓ వైద్యుడి నుంచి సైబర్ నేరగాళ్లు ఇటీవల రూ.73.20 లక్షలు కొల్లగొట్టడం చర్చనీయాంశమైంది. మీ పేరిట ఉన్న పార్సిల్‌లో పాస్‌పోర్టులు, ఏటీఎం కార్డులు, డ్రగ్స్, ల్యాప్‌టాప్‌లు ఉన్నాయంటూ ఫోన్‌లోనే బెదిరించారు. ఆయన బ్యాంకు ఖాతాల వివరాలు తెలుసుకొని నగదు మొత్తం లాగేశారు.

❖ తాడేపల్లిగూడేనికి చెందిన వృద్ధుడికి ఓ మహిళ సామాజిక మాధ్యమాల్లో ఛాటింగ్ ద్వారా పరిచయమైంది. కొన్నిరోజుల పాటు హద్దులు లేని ఆన్‌లైన్ ముచ్చట్లు కొనసాగాక ఆమె జీవితం నాశనమైందంటూ అపరిచిత వ్యక్తులు సదరు వృద్ధుడికి ఫోన్ చేసి బెదిరింపులకు దిగి రూ. 3 లక్షల వరకు కాజేశారు.



రోజుకో కొత్త మోసం

❖ మీ పేరిట వచ్చిన పార్సిల్లో డ్రగ్స్, నిషేధిత వస్తువులు ఉన్నాయని.. విచారణ నిమిత్తం అరెస్టు చేస్తున్నామంటూ సైబర్ క్రైం పోలీసుల పేరిట మోసగాళ్లు ఫోన్ చేస్తున్నారు. ముందుగా వారు పేరు, చిరునామా ఇతరత్రా కొన్ని వివరాలు చెప్పి బ్యాంకు ఖాతాల సమాచారం అడుగుతున్నారు. కాలర్ ఐడీ యాప్‌లలోనూ వారి ఫోన్ నంబర్లు ఢిల్లీ సైబర్, ముంబయి సైబర్ అనో కనిపిస్తుండటంతో కొందరు భయపడి వివరాలు చెప్పగానే ఖాతాల్లో సొమ్మంతా లాగేస్తున్నారు.

❖ ఆన్‌లైన్ స్నేహం పేరిట వివిధ యాప్‌ల ద్వారా మోసగాళ్లు అందినకాడికి లాగేస్తున్నారు. యువత, మహిళలతో ఆన్‌లైన్ ఛాటింగ్, వీడియోకాల్స్‌తో ఎరవేస్తున్నారు. తర్వాత సదరు యువతి ఆత్మహత్య చేసుకుందని.. అంతకు ముందు ఆమె మీతోనే మాట్లాడిందని బెదిరించి సొమ్ము డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి బాధితుల్లో వృద్ధులూ ఉండటం గమనార్హం.

❖ మీకు లాటరీ వచ్చిందని, లక్కీడిప్‌లో మీ చరవాణి నంబరు ఎంపికైందని నమ్మిస్తున్నారు. దీనికి ముందుగా పన్నులు చెల్లించాలంటూ సొమ్ము కాజేస్తున్నారు.

1930 నంబరుకు కాల్ చేయండి

సైబర్ మోసానికి గురైనట్లు గ్రహించిన వెంటనే 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలి. సంబంధిత బ్యాంకు ఖాతాల్లో నగదు బదలాయింపులు నిలిపివేస్తారు. దీనివల్ల రికవరీకి అవకాశం ఉంటుంది. సైబర్ మోసాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఎవరైనా ఫోన్‌లో బ్యాంకుఖాతాలు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు, వ్యక్తిగత సమాచారం కోరితే ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పవద్దు.

- అద్నాన్ నయీం అస్మి, ఎస్పీ, పశ్చిమగోదావరి

మాటలకందని విజయాలు!

క్రికెట్, అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న బధిర యువతి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: విధి చిన్నచూపు చూసినా వెరవక ధైర్యంగా ముందుకు సాగుతూ తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకొనే వారు అరుదుగా ఉంటారు. ఈ కోవలోకే వస్తారు వీరవాసరం మండలం బుధారాయుడుచెరువు గ్రామానికి చెందిన చదరం మీనా సూర్యకుమారి. పుట్టుకతోనే మూగ అయిన ఈమె క్రికెట్, అథ్లెటిక్స్ క్రీడలతో పాటు నృత్యంలో రాణిస్తూ పతకాలు సొంతం చేసుకున్నారు.



మీనా సూర్యకుమారి

పాఠశాల స్థాయి నుంచి.. మీనా సూర్యకుమారికి మాటలు రావు. భీమవరంలోని శ్రీవేంకటేశ్వర బధిరోన్నత పాఠశాలలో చదివారు. పదో తరగతి పూర్తి చేసేలోపు అథ్లెటిక్స్ (పరుగు, లాంగ్ జంప్, హైజంప్)లో రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటి పతకాలు అందుకున్నారు. అనంతరం తిరుపతిలో ఇంటర్మీడియట్ చదివారు. అక్కడ కూడా క్రీడల్లో బహుముఖ ప్రతిభతో రాణించారు. విజయవాడలో డిగ్రీ చదువుతున్న సమయంలో క్రికెట్, నృత్యంలో శిక్షణ పొందారు. వివిధ సాంస్కృతిక వేదికలపై నృత్య ప్రదర్శనలిచ్చారు.

★ ఆంధ్రప్రదేశ్ బధిర మహిళా క్రికెట్ అసోసియేషన్ నిర్వహించే పోటీల్లో మీనా పాల్గొన్నారు. ముంబయిలో ఈ ఏడాది జనవరిలో జరిగిన టి-20 టోర్నీలో బ్యాటింగ్, బౌలింగ్‌లో సత్తాచాటారు. ఆగస్టు 6 నుంచి 9వ తేదీ వరకు హరియాణాలో జరిగిన క్రికెట్ టోర్నీలోనూ రాణించి ప్రత్యేక ప్రశంసలు అందుకున్నారు. చదువులో రాణిస్తూనే క్రీడా ప్రతిభతో ఉద్యోగం సంపాదించాలన్నదే మీనా లక్ష్యమని ఆమె తల్లిదండ్రులు వెంకటలక్ష్మి, విజయభాస్కరరావు చెప్పారు.

వైకాపా నాయకుడి కోపం.. ప్రజలకు శాపం!

సీసీ రహదారిపై కంచె, రాళ్లు పేర్చిన వైనం



ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ప్రభుత్వం మారినా వైకాపా నాయకుల ఆగడాలు మాత్రం ఆగడం లేదు. మమ్మల్ని ఏమీ చేయలేరంటూ పంచాయతీ రోడ్లకు అడ్డంగా కంచెలు, గోడలు కట్టి ప్రజల రాకపోకలను అడ్డుకుంటున్నారు. వారిని అడ్డుకునే ధైర్యం లేక అధికారులు సైతం చోద్యం చూస్తున్నారు. అటువంటి ఘటన ఒకటి తాజాగా ద్వారకాతిరుమల మండలం తిమ్మాపురంలో వెలుగుచూసింది. ఈ గ్రామంలో ఆరేళ్ల కిందట గీతా మందిరం వీధిలో పంచాయతీ అధికారులు సీసీ రహదారి నిర్మించారు. ఆ ప్రాంతంలో ఓ ఇంటి వద్ద రోడ్డు పక్కనే ఇంకుడు గుంత తవ్వారు. దానిని పూడ్చాలంటూ రెండు నెలల కిందట గ్రామానికి చెందిన వైకాపా నేత బోళ్ల వెంకట కిశోర్ సదరు వ్యక్తులతో గొడవకు దిగాడు. అంతటితో ఆగకుండా ప్రజలు రాకపోకలు సాగించే రహదారికి అడ్డంగా కంచె వేయడంతో పాటు రాళ్లతో గోడలాగా పేర్చి అటుగా రాకపోకలు లేకుండా మూసివేశారు. ఈ విషయాన్ని గ్రామస్థులు అనేకసార్లు పంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు. విసుగు చెందిన కొందరు ఇటీవల ఏలూరు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. అయినా ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

నేడు త్రిపుర గవర్నర్ రాక

ఏలూరు కలెక్టరేట్, ఉంగుటూరు- న్యూస్‌టుడే: త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి శనివారం జిల్లాకు రానున్నారు. ఆయన మధ్యాహ్నం 12 గంటలకు భాజపా ఉంగుటూరు నియోజకవర్గ కన్వీనరు మాలతీరాణి ఇంటికి చేరుకొని.. పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమవుతారు. 1.30 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య గోపీనాథపట్నంలోని శ్రీలక్ష్మీ నారాయణ ఫౌండేషన్ వద్ద భోజన విరామం తీసుకొని.. ఆపై ఆక్వా రైతుల సమావేశం కానున్నారు. అనంతరం ఆయన భీమవరం బయల్దేరి వెళ్తారు.

ఉద్యోగ, కార్మిక సంఘాల పాత్ర కీలకం

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలపై ఏఐటీయూసీ చేపడుతున్న పోరాటాలు, ఆందోళనల్లో ఆయా సంఘాలు క్రియాశీలకంగా పాల్గొనాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు చలసాని వెంకట రామారావు పిలుపునిచ్చారు. స్థానిక స్ఫూర్తి భవనంలో ఏఐటీయూసీ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ డాంగే అధ్యక్షత వహించారు. వెంకట రామారావు మాట్లాడుతూ... కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటుపరం చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోందన్నారు. నవంబరు 10న ఏలూరులో నిర్వహించనున్న ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఆయాల రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని ఆయన కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కృష్ణచైతన్య, నాయకులు కృష్ణమాచార్యులు, పుల్లారావు, బండి వెంకటేశ్వరరావు, కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకట రామారావు

నేటి నుంచి అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీలు

మార్టేరు, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల స్కూల్‌గేమ్స్ అండర్-17 బాల బాలికల బాస్కెట్‌బాల్ పోటీలు, సెలక్షన్స్ ఈ నెల 26 నుంచి మార్టేరు ఎస్వీజీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు స్కూల్ హెచ్‌ఎం సీహెచ్ సీఎస్ఎన్.రెడ్డి, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.కృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు 13 జిల్లాల నుంచి బాలుర, బాలికల జట్లు హాజరు కానున్నట్లు చెప్పారు. కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పోటీలను ప్రారంభిస్తారన్నారు. స్థానిక ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అధ్యక్షతన జరిగే పోటీల ప్రారంభ కార్యక్రమానికి కలెక్టర్ సి.నాగరాణి, కాకినాడ ఆర్‌జేడీ ఎస్ఈ జి.నాగమణి, జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కానున్నారని చెప్పారు. సమావేశంలో రిసోర్స్‌పర్సన్ అంజలి, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

29న ఖోఖో జట్ల ఎంపిక..

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే: ఉంగుటూరు మండలం కైకరం జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 29న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా క్రీడా సమాఖ్య ఆధ్వర్యాన అండర్-14, 17 విభాగాల బాలబాలికల ఖోఖో పోటీలు నిర్వహించనున్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్నారు. మరిన్ని వివరాలకు 83283 12583 నంబరును సంప్రదించాలని ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహణాధికారిణి కె.అలివేలు మంగ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

29న జిల్లా రైతు సదస్సు

కైకరం(ఉంగుటూరు), న్యూస్‌టుడే: కైకరంలో 'ధాన్యం మద్దతు ధర- కొనుగోలు' సమస్యలపై ఈ నెల 29న జిల్లా స్థాయి రైతు సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తెలిపారు. కైకరంలోని తూర్పువీధి రామాలయం ఆవరణలో శుక్రవారం కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. కేరళ తరహాలో క్వింటా ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం సైతం బోనస్ ఇవ్వాలన్నారు. ధాన్యం మద్దతు ధర- కొనుగోలు సమస్యలపై సదస్సులో చర్చించి కార్యాచరణ రూపొందిస్తామని ఆయన పేర్కొన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు, మాజీ అధ్యక్షుడు గుత్తికొండ వెంకట కృష్ణారావు, కౌలు రైతు సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు, కో-కన్వీనర్ వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, రైతులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ పోలీసులు వేధించారంటూ

యువకుడి ఆత్మహత్యాయత్నం

కామవరపుకోట(జంగారెడ్డిగూడెం పట్టణం), న్యూస్‌టుడే: ఎక్సైజ్ అధికారులు వేధించారంటూ ఓ యువకుడు ఆత్మహత్యకు యత్నించిన ఘటన కామవరపుకోట మండలంలో చోటుచేసుకుంది. తడికలపూడి, కళ్లచెరువు, జీలకర్రగూడెం, కేఎస్ రామవరం గ్రామాల్లో మద్యం అక్రమంగా విక్రయిస్తున్న నలుగురిని చింతలపూడి ఎక్సైజ్ సీఐ అశోక్ ఆధ్వర్యంలో గురువారం పట్టుకుని చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. వీరిలో తడికలపూడికి చెందిన అందుగుల రత్నారావు అనే యువకుడు స్టేషన్‌లో తనను దుర్భాషలాడి, కొట్టిన చిత్రాలను పలు వాట్సప్ గ్రూపుల్లో పెట్టారంటూ మనస్తాపం చెంది.. అదే రోజు రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వ్యాప్తి చెందింది. విషయం తెలుసుకున్న అతడి బంధువులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. 'రత్నారావు చెప్పినవి అవాస్తవాలు. అతడిని దుర్భాషలాడటం, కొట్టడం వంటివి చేయలేదు' అని చింతలపూడి ఎక్సైజ్ సీఐ అశోక్ తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

దెందులూరు, న్యూస్‌టుడే: దోసపాడులోని ఓ రైసు మిల్లులో 380 సంచుల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 190 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్, పౌరసరఫరాల అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని ఓ రైసు మిల్లులో రేషన్ బియ్యం అక్రమ రవాణా అవుతోందన్న ముందస్తు సమాచారంతో అధికారులు దాడులు చేశారు. మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యం గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దీన్ని పాలిష్ చేసి తమిళనాడుకు అక్రమంగా రవాణా చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. రెండు వాహనాలు, రేషన్ బియ్యం విలువ రూ. 11 లక్షలు ఉంటుందని వారు తెలిపారు. పల్నాడు జిల్లాకు చెందిన బాలినేని తేజ, వెలుపుర్ల శ్రీనివాస్(వాసు), చిలకలూరిపేటకు చెందిన ఇస్మాయేలు, ఏలూరుకు చెందిన చీదెళ్ల పవిత్రకుమార్, తాడేపల్లిగూడేనికి చెందిన శానం రామకృష్ణ, రాధా, తాడాల శరత్ జీవన్, దాదాన శివకార్తీక్‌రెడ్డిపై ఇన్‌ఛార్జి సీఎస్ డీటీ భరత్‌కుమార్ కేసు నమోదు చేశారు. దాడుల్లో విజిలెన్స్ సీఐ పి.శివరామకృష్ణ, ఎస్సై సీహెచ్ రంజిత్ కుమార్, రెవెన్యూ, పౌర సరఫరా అధికారులు పాల్గొన్నారు.



బియ్యం బస్తాల వద్ద అధికారులు

ఎటు చూసినా నిర్లక్ష్యమే!

ఏలూరు వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఎటుచూసినా అసౌకర్యాలే కనిపిస్తున్నాయి. రైతులు, వ్యాపారుల అవసరాలకు అనుగుణంగా షెడ్లు, మరుగుదొడ్లు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. వైకాపా హయాంలో గత మార్చిలో రూ.360 లక్షల వ్యయంతో చేపట్టిన జంబోషెడ్ల నిర్మాణం పునాదుల్లోనే నిలిచిపోయింది. రూ.30 లక్షల వ్యయంతో చేపట్టిన మరుగుదొడ్ల నిర్మాణం మొదలుకాలేదు. రూ.30 లక్షల విలువ చేసే నిమ్మకాయల గ్రేడింగ్ యూనిట్ పరికరాలు నిరుపయోగంగా ఉన్నాయి. దీనిపై కార్యదర్శి ఎ.శారదారాణి మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న జంబోషెడ్లు, మరుగుదొడ్ల నిర్మాణాలపై ఉన్నతాధికారులకు విన్నవించామన్నారు. నిమ్మకాయల గ్రేడింగ్ యూనిట్‌ను అద్దె ప్రాతిపదికన వినియోగించేందుకు స్థానికులు ఆసక్తి చూపడం లేదన్నారు. **- ఈనాడు, ఏలూరు**



పునాదుల్లో నిలిచిన జంబోషెడ్ల నిర్మాణం



నిరుపయోగంగా నిమ్మకాయల గ్రేడింగ్ యూనిట్ పరికరాలు



తుప్పల్లో మరుగుదొడ్లు

విద్యుత్తు సమస్యలకు సత్వర పరిష్కారం



ఫోరం ఛైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న నరసింహారావు

నారాయణపురం(ఉంగుటూరు), న్యూస్‌టుడే: వినియోగదారుల విద్యుత్తు సమస్యలు సత్వరం పరిష్కరిస్తున్నామని వినియోగదారుల ఫోరం ఛైర్మన్ బి.సత్యనారాయణ తెలిపారు. నారాయణపురం ఉపకేంద్రం కార్యాలయంలో శుక్రవారం ఏపీఈపీడీసీఎల్ విద్యుత్తు వినియోగదారుల పరిష్కార వేదిక నిర్వహించారు. సత్యనారాయణ మాట్లాడుతూ.. వినియోగదారుల నుంచి ఛార్జీలు వసూలు చేస్తున్నప్పుడు వారికి నాణ్యమైన సేవలందించాల్సిన బాధ్యత సంస్థపై ఉందన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 395 ఫిర్యాదులందగా.. 315 పరిష్కరించామన్నారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉద్యోగులకు 107 కేసుల్లో రూ.14.26 లక్షల జరిమానా విధించామన్నారు. వినియోగదారులు విద్యుత్తు సమస్యలపై టోల్‌ఫ్రీ నంబరు 1912కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చని ఆయన పేర్కొన్నారు. అంతకుముందు వివిధ విద్యుత్తు సమస్యలపై తల్లాపురం సర్పంచి పసుపులేటి నరసింహారావుతో పాటు తదితరులు వినతిపత్రాలు అందజేశారు. ఎస్ఈ సాల్మన్‌రాజు, ఈఈ అంబేడ్కర్, ఏడీ రామకృష్ణ, ఫోరం సభ్యులు ఎస్ఎం మణి, షేక్ బాబర్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన ర్యాంకు సాధిస్తాం

చురుగ్గా కొత్త పంటలపై పరిశోధనలు

• ఉద్యాన విశ్వవిద్యాలయ ఇన్‌ఛార్జి వీసీ

ఇంటర్వ్యూ

ఉద్యాన విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే : వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం జాతీయ స్థాయిలో మెరుగైన ర్యాంకు సాధించేలా కృషి చేస్తున్నామని ఇన్‌ఛార్జి ఉప కులపతి కురుబ గోపాల్ తెలిపారు. దేశంలో మొదటి 40 స్థానాల్లో వర్సిటీ నిలిపేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టామన్నారు. దీని కోసం ప్రత్యేకంగా పీఎంఈ సెల్ కూడా ఏర్పాటు చేశామన్నారు. ఆయన బాధ్యతలు చేపట్టి రెండు నెలలు పూర్తయిన సందర్భంగా 'న్యూస్‌టుడే'తో ప్రత్యేకంగా మాట్లాడారు.



గోపాల్

మూడు ఏఐసీఆర్పీలు మంజూరు

ఐసీఏఆర్ సహకారంతో కొత్త పంటలపై పరిశోధనలు చేసేందుకు ఉద్యాన విశ్వవిద్యాలయానికి మూడు ఆల్ ఇండియా కో ఆర్డినేటెడ్ ప్రాజెక్టులు (ఏఐసీఆర్పీ) కొత్తగా మంజూరయ్యాయి. మహానంది (నంద్యాల జిల్లా), దర్శి (ప్రకాశం జిల్లా), పెద్దపేట (శ్రీకాకుళం జిల్లా)లోని పరిశోధన స్థానాలకు అనుబంధంగా వీటిని ఏర్పాటు చేస్తున్నాం. ఏఐసీఆర్పీల ద్వారా మహానందిలో క్వినోవా, ఫాబా బీన్, దర్శిలో గ్రెయిన్ అమరాంత్, పెద్దపేటలో వింగ్డ్ బీన్ వంటి కొత్త పంటలపై ప్రయోగాలు జరుగుతాయి. ఇప్పటికే ఆయా పరిశోధన స్థానాల్లోని ఒక్కరు చొప్పున ముగ్గురు శాస్త్రవేత్తలు మేఘాలయలో జరిగిన కార్యశాలకు వెళ్లారు.

47 మందికి స్థాన చలనం

గత నాలుగేళ్లలో వర్సిటీలో బదిలీలు జరగలేదు. చాలా మంది బదిలీల కోసం ఎదురు చూస్తున్నారు. ఇటీవల శాస్త్రవేత్తలు, సీనియర్ శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు మొత్తం 47 మందిని బదిలీ చేశాం. గతేడాది కొత్తగా ప్రారంభించిన పులివెందుల ఉద్యాన కళాశాలకు అసోసియేట్ డీన్‌ను కూడా నియమించాం. రెండేళ్ల నుంచి వర్సిటీ ప్రధాన పోస్టులను ఇన్‌ఛార్జులే నెట్టుకొస్తున్నారు. ఇన్‌ఛార్జులను తొలగించి, నిబంధనల ప్రకారం ఎవరు ఏ పోస్టుకు అర్హులో వారినే నియమించాం. ఒక్క కంట్రోలర్ పోస్టు మాత్రమే రిజిస్ట్రార్ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. వర్సిటీ పరిధిలోని అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు, అధ్యాపకేతర సిబ్బందికి వేతనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నాం.

కొత్త కోర్సులు, విభాగాలు

ఉద్యాన డిగ్రీ ఆవశ్యకతను విద్యార్థులకు వివరిస్తున్నాం. అటవీ, వ్యవసాయ యాంత్రీకరణ, ప్రాసెసింగ్ వంటి కోర్సులు అందుబాటులోకి తీసుకొస్తాం. పీజీ, పీహెచ్‌డీలో కీటక, మొక్కల తెగుళ్లు, ప్రజనన విభాగాలు అందుబాటులోకి తెస్తాం. నాబార్డు-ఆర్ డీఎఫ్ నిధులు రూ.3.97 కోట్లతో నిర్మించిన కేంద్ర గ్రంథాలయాన్ని త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తాం.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 125, 134, 145 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

ఇగ్నో కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో) దూరవిద్య కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీఆర్ఆర్ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యుడు కేవీ రామరాజు తెలిపారు. ఆయా కోర్సుల్లో ప్రవేశానికి నెలాఖరులోపు దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు https:///ignouadmission.samarth.edu.in/ వెబ్‌సైట్ చూడవచ్చని పేర్కొన్నారు.

పది పరీక్షల రుసుము చెల్లింపు గడువు 11

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు నవంబరు 11లోపు రుసుము చెల్లించాలని డీఈవో ఎస్.అబ్రహం తెలిపారు. 18 వరకు రూ.50, 25 వరకు రూ.200, 30వ తేదీలోపు రూ.500 అపరాధ రుసుము చెల్లించేందుకు అవకాశం కల్పించిందని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఏలూరు
•ఏలూరు •దెందులూరు •ఉంగుటూరు

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



బాలుర జట్టుతో అలివేలు మంగ, శిక్షకులు

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా తెనాలి ఎన్టీఆర్ డీఎస్ఏ మైదానంలో శనివారం నుంచి రాష్ట్ర స్థాయి అండర్-14 హ్యాండ్‌బాల్ బాలబాలికల క్రీడా పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి 36 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. వారిని అండర్-14 విభాగం ఉమ్మడి జిల్లా పాఠశాల క్రీడా కార్యదర్శి కె.అలివేలు మంగ, శిక్షకులు శుక్రవారం అభినందించారు.

భీమడోలులో రైళ్ల నిలుపుదలకు వినతి

భీమడోలు, న్యూస్‌టుడే: భీమడోలు రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదలకు సహకరించాలని పలువురు తెదేపా నాయకులు కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులుతో కలిసి కురెళ్లగూడెంలో ఎంపీ మహేశ్ కుమార్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. భీమడోలుకు ద్వారకాతిరుమల క్షేత్రం కేవలం 16 కిలోమీటర్ల దూరంలోనే ఉందని చెప్పారు. యాత్రికులు, ప్రయాణికుల సౌకర్యార్థం రత్నాచల్, జన్మభూమి, గౌతమి, శిర్డీ ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదలకు తోడ్పాటునందించాలని వారు కోరారు. నాయకులు హరీశ్, పెద్దిరాజు, రామతులసమ్మ, సుబ్రహ్మణ్యం, నాగ గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఏలూరు తూర్పువీధి: 80081 23847 | ఏలూరు గ్రామీణ: 80085 74535
పెదపాడు, పెదవేగి: 80085 74483 | ఉంగుటూరు: 79933 00492

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే

సమస్య: శాంతినగర్ 6వారు 13వ రోడ్డులోని గుడివాడ వారి వీధిలో నివాసాల ముందున్న మురుగు కాలువను శుభ్రం చేసి నెలలు గడుస్తోంది. వాడుక నీరు బయటకెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. **- కుమారి, స్థానికురాలు**

సమాధానం: సిబ్బందిని పంపి కాలువలో పూడిక తీయిస్తాం. **- జి.చంద్రయ్య, నగరపాలక సహాయాధికారి**

సమస్య: దక్షిణపువీధి శెనగపప్పుబజార్ రోడ్డులో వీధి దీపం వెలగడం లేదు. రాత్రివేళ పాదచారులు, వాహన చోదకులు చీకట్లో బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. **- టి.రాకేశ్‌వర్మ, స్థానికుడు**

సమాధానం: సిబ్బందితో వీధి దీపానికి మరమ్మతులు చేయిస్తాం. **- కె.శేషగిరి, విద్యుత్తు ఏఈ**

సమస్య: ఒకటో పట్టణం ది-ఇండో ఆంగ్ల మాధ్యమ పాఠశాల రోడ్డులోని కాలువల్లో మురుగునీరు ముందుకెళ్లడం లేదు. దుర్వాసన రావడంతో పాటు రాత్రిళ్లు దోమల బెడద అధికంగా ఉంటోంది. **- పి.సురేశ్, స్థానికుడు**

సమాధానం: కాలువలో పూడిక తీయించి, దోమల నివారణకు మందు పిచికారీ చేయిస్తాం. **- శివారెడ్డి, నగరపాలక ఉప అధికారి**

నిడమర్రు, న్యూస్‌టుడే

సమస్య: పెదనిండ్రకొలను జడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు హిందీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఫలితంగా విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి పోస్టులు భర్తీ చేయాలి. **- విద్యార్థుల తల్లిదండ్రులు**

సమాధానం: పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా. **- టీవీ సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయుడు**

వెలిగిన వీధి దీపం

స్పందనకు స్పందన

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే: అశోక్‌నగర్ పాత ఆంధ్రాబ్యాంకు రోడ్డులోని వీధి దీపం ఎట్టకేలకు వెలిగింది. ఆరు రోజులుగా దీపం వెలగకపోవడంపై 'మేమున్నాం.. మీకు తోడుగా'లో ఈ నెల 17న వార్త ప్రచురితమైంది. విద్యుత్తు ఏఈ కె.శేషగిరి స్పందించి, సిబ్బందిని పంపి దీపానికి మరమ్మతులు చేయించారు.

కాలువలకు శుభ్రం.. ఏలూరు - చింతలపూడి రోడ్డులోని రాజరాజేశ్వరి నగర్ మూడో రోడ్డులో మురుగు కాలువలు శుభ్రం చేయించారు. కాలువల్లో పూడిక పేరుకుపోవడంపై ఈ నెల 18న ప్రచురితమైన వార్తకు నగరపాలక సహాయాధికారి జి.చంద్రయ్య స్పందించి, సమస్య పరిష్కరించారు.

పూడికతీత.. శాంతినగర్ ఆరో రోడ్డులోని కాలువల్లో పూడిక తీయించారు. కాలువల్లో మురుగు పారకపోవడంపై ఈ నెల 17న ప్రచురితమైన వార్తకు నగరపాలక సహాయాధికారి చంద్రయ్య స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బందిని పంపి కాలువల్లో పూడిక తీయించారు.

13 గ్రామాలు.. 6 కిలోమీటర్లు.. 30 నిమిషాలు

గుంతల దారిలో అవస్థలు పడుతున్న ప్రయాణికులు

వట్లూరు(పెదపాడు), న్యూస్‌టుడే

పెదపాడు- వట్లూరు జిల్లా పరిషత్తు రహదారిలో ప్రయాణమంటేనే ప్రజలు హడలిపోతున్నారు. ఈ మార్గంలో నిత్యం వందలాది మంది ప్రయాణికులు, విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు రాకపోకలు సాగిస్తున్నారు. సుమారు 6 కిలోమీటర్ల రోడ్డు మొత్తం గుంతలమయంగా మారింది. వట్లూరు నుంచి మండల కేంద్రం పెదపాడు వెళ్లేందుకు ఈ రహదారే శరణ్యం. గొయ్యిల్లాంటి గోతులు తప్పించుకుంటూ, నెమ్మదిగా వెళ్తుండటంతో సుమారు 30 నిమిషాల మేర సమయం పడుతోంది. మండలంలోని దాదాపు 13 గ్రామాల ప్రజలు ఈ మార్గం మీదుగానే ఏలూరుకు వెళ్తుంటారు.



అధ్వానంగా వట్లూరు- పెదపాడు రహదారి



వట్లూరు మురుగు కాలువ సమీపంలో..

గత పాలకుల పాపం

గత తెదేపా ప్రభుత్వం హయాంలో ఈ రహదారిని అభివృద్ధి చేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా... రోడ్డు విస్తరణ, మరమ్మతులను పూర్తిగా విస్మరించింది. వర్షాలకు దెబ్బతిన్న రహదారిపై తట్టెడు మట్టి పోసిన దాఖలాలు లేవు. ఫలితంగా రోడ్డు మరింత దెబ్బతిని గోతులు తటాకాలుగా మారాయి. ఇక వర్షం కురిస్తే ఎక్కడ గొయ్యి ఉందో, దారెందో తెలియక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారిని బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు. 'రోడ్డు దుస్థితిని ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదించాం. తాత్కాలికంగా మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకుంటాం' అని పీఆర్ ఏఈ కృష్ణారావు తెలిపారు.



శిలాఫలకం వద్ద ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు

రోడ్ల నిర్మాణాలకు ప్రాధాన్యం

నిడమర్రు, న్యూస్‌టుడే: ఎన్డీయే ప్రభుత్వం గ్రామీణ రహదారుల నిర్మాణాలకు ప్రాధాన్యమిస్తోందని ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ యాదవ్, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. పత్తేపురం- తోకలపల్లి రహదారి నిర్మాణానికి శుక్రవారం వారు శంకుస్థాపన చేసి మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు పెద్దపీట వేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని విస్మరించిందని వారు ధ్వజమెత్తారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ.. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు చూసి ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఎన్డీయే నాయకులు ముత్యాల స్వామి, నిమ్మల దొరబాబు, అచ్చుత భాస్కరరావు, శరణాల మాలతీరాణి, పత్తేపురం సర్పంచి నీలపాల సాయిప్రియ, ఉప సర్పంచి రుద్రరాజు కొండ్రాజు తదితరులు పాల్గొన్నారు.

పశుగణనతో మేలు.. నారాయణపురం(ఉంగుటూరు): పశుసంవర్ధక శాఖ పథకాలను సమర్థంగా అమలు చేసేందుకు, పర్యవేక్షించేందుకు పశుగణన సమాచారం కీలకంగా మారనున్నట్లు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. నారాయణపురం విడిది కార్యాలయంలో పశుగణన కార్యక్రమ కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. గణపవరం సహాయ సంచాలకుడు డీఎం నాయక్, పశు వైద్యులు శిరీష, కిశోర్, అశోక్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



బాధితుడి సమస్య ఆలకిస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారమే ఎన్డీయే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. పవరుపేటలోని విడిది కార్యాలయంలో శుక్రవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వాటికి వెంటనే పరిష్కార మార్గం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులున్నా, నేరుగా తనను కలిసి చెప్పొచ్చన్నారు. వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యుడు వెంకటరత్నం, తెదేపా నగరాధ్యక్షుడు శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దఎత్తున అన్నసమారాధన.. ఏలూరు అర్బన్: దసరా మహోత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక పాండురంగపురంలోని శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో శుక్రవారం అన్న సమారాధన చేపట్టారు. ఎమ్మెల్యే బడేటి చంటి, భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి ముఖ్య అతిథులుగా హాజరై అన్నదానాన్ని ప్రారంభించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు వి.వెంకటరంగారావు, కార్యదర్శి జె.జగదీశ్వరరావు, కోశాధికారి ఐ.రామకృష్ణ పాల్గొన్నారు.

సృజనకు పట్టం!

'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు



వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు



విజేతలకు బహుమతులు ఇస్తున్న ఉపాధ్యాయులు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దాగున్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహిస్తున్నారు. స్థానిక శ్రీకృష్ణదేవరాయ నగర పాలకోన్నత పాఠశాల ఆవరణలో 'అంతర్జాలం వినియోగంతో లాభనష్టాలు- విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం'పై శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 8, 9, 10 తరగతుల విద్యార్థిని, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అంతర్జాలం, సామాజిక మాధ్యమాలను అవసరమైన మేర మాత్రమే వినియోగించాలని, లేకపోతే అనర్థాలు ఎదుర్కోవాల్సి వస్తుందని తమ రచనలతో జాగృతిపరిచారు. పోటీల్లో కె.కుసుమంత్(ప్రథమ), ఎం.ప్రభుకుమార్(ద్వితీయ), కె.వాసుదేవ కార్తిక్(తృతీయ) స్థానాల్లో గెలుపొందగా- వారికి పాఠశాల ఇన్‌ఛార్జి రత్నకుమార్ బహుమతులు ప్రదానం చేశారు. ఎన్ఎల్ రమ్య, ఎస్.ప్రభాకర్, బి.శ్యామల, ఎస్కే షమీరా బేగం, వి.తులసీకృష్ణవేణి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

దోమల వ్యాప్తిని నిర్మూలిద్దాం

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ తోడ్పాటు నివ్వాలని జిల్లా మలేరియా అధికారి పీఎస్ఎస్ ప్రసాద్ సూచించారు. స్థానిక సాయినగర్‌లో శుక్రవారం డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యారోగ్య సిబ్బంది, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రదర్శన నిర్వహించారు. ఆరోగ్య విస్తరణాధికారి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా సొసైటీ సమావేశం

గుండుగొలను(భీమడోలు), న్యూస్‌టుడే: గుండుగొలను విశాల సహకార సంఘం సర్వసభ్య సమావేశం శుక్రవారం రసాభాసగా మారింది. సభ్యుల ఆరోపణలు, వాగ్వాదాలతో కాసేపు దద్దరిల్లింది. సొసైటీ కార్యదర్శి రమేశ్ నారాయణం, వేంద్ర పవన్ చక్రవర్తి ఆధ్వర్యాన సమావేశం నిర్వహించారు. కోరం లేకుండా సర్వసభ్య సమావేశం ఎలా నిర్వహిస్తారని సంఘ సభ్యులు రాఘవ వెంకటరమణ, చింత జేసు శ్యామూల్‌రాజు, చుండ్రు సుబ్బారావు తదితరులు ప్రశ్నించారు. సొసైటీ అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. సభ్యుల వాగ్వాదం మధ్య సమావేశాన్ని అర్ధాంతరంగా ముగించారు.

ఉద్యానవనమా... వనమా!

ఏలూరులో రూపు కోల్పోయిన పార్కు



ప్రవేశ ద్వారం వద్ద ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు



జారుడుబల్ల వద్ద పరిస్థితి ఇలా...



మూలకు చేరిన ఆట వస్తువులు

పిల్లలు సరదాగా ఆడుకునేందుకు.. వారిలో మానసికోల్లాసం పెంచేందుకు.. పెద్దలు రోజూ ఉదయం, సాయంత్రం వేళ నడక సాగించేందుకు.. కాసేపు సేద దీరేందుకు వీలుగా ఏలూరు మినీ బైపాస్ విజయ గార్డెన్స్ ఉద్యోగుల కాలనీలో నగరపాలక సంస్థ ఉద్యానవనం ఏర్పాటు చేసింది. దీని నిర్వహణను గాలికి వదిలేయడంతో... కళావిహీనంగా మారింది. ఆట వస్తువులు తుప్పుపట్టి, మూలకు చేరాయి. ప్రవేశ ద్వారం వద్దే పెద్దఎత్తున పిచ్చిమొక్కలు పెరిగిపోయి అధ్వానంగా దర్శనమిస్తోంది. ఉద్యాన వనాన్ని శుభ్రం చేయించి, అందుబాటులోకి తేవాల్సిన నగరపాలక అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇకనైనా పాలకులు, అధికారులు స్పందించి ఉద్యాన వనాన్ని శుభ్రం చేయించి, ఆట వస్తువులను బాగు చేయించి వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, ఏలూరు నగరం

మద్యం గొలుసు దుకాణాలు అరికట్టండి



గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

భీమడోలు, న్యూస్‌టుడే: గ్రామాల్లో విపరీతంగా పెరుగుతోన్న మద్యం గొలుసు దుకాణాలను అరికట్టాలని పలువురు ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ కనమాల రామయ్య అధ్యక్షత వహించారు. పలువురు సభ్యులు మాట్లాడుతూ... గ్రామాల్లో మద్యం గొలుసు దుకాణాల కారణంగా అనేక సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ సక్రమంగా అమలు చేయాలన్నారు. బీసీ బాలుర వసతి గృహంలో నీటి ఎద్దడిని నివారించాలని కోరారు. అనంతరం పశుగణన, ప్రధానమంత్రి సూర్య ఘర్ ప్రచార గోడపత్రాలు ఆవిష్కరించారు. జడ్పీటీసీ సభ్యురాలు తుమ్మగుంట భవానిరంగ, ఎంపీడీవో పద్మావతిదేవి, తహసీల్దారు రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు సినీ మాలు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే

అంబిక డీలక్స్	లవ్ రెడ్డి
అంబిక మినీ	వెనమ్
సాయిబాలాజీ	మా నాన్న సూపర్ హీరో
బాలాజీ	పొట్టేల్
సత్యనారాయణ స్క్రీన్ 1	విశ్వం
సత్యనారాయణ స్క్రీన్ 2	వేట్టయన్
సత్యనారాయణ స్క్రీన్ 3	వెనమ్
విజయలక్ష్మి వీమ్యాక్స్ 1	దేవర
విజయలక్ష్మి వీమ్యాక్స్ 2	లగ్గం
విజయలక్ష్మి వీమ్యాక్స్ 3	గ్యాంగ్‌స్టర్
ఎస్వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 1	లవ్ రెడ్డి / జనక అయితే గనక / వెనమ్
ఎస్వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 2	దేవర
ఎస్వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 3	వేట్టయన్
ఎస్వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 4	విశ్వం

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: పత్తేబాదకు చెందిన మరడాని నవీన్ కోష్లీ(31)కి వివాహం కాలేదు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. జీవితంపై విరక్తితో స్థానిక చిట్టివలసపాకల ప్రాంతంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. రైల్వే పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని.. మృతదేహాన్ని సర్వజన ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వాహన చోదకుడికి మూణ్నెల్ల జైలు

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: వ్యాను నిర్లక్ష్యంగా నడిపి ఒకరి మృతికి, మరొకరి గాయాలకు కారకుడైన డ్రైవర్‌కు మూడు నెలల జైలు, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ నూజివీడులో స్పెషల్ మేజిస్ట్రేట్ శుక్రవారం తీర్పునిచ్చింది. ప్రాసిక్యూషన్ కథనం మేరకు 2018 జనవరి 20న పెదపాడు మండలం పెదారవీడుకు చెందిన కురుమ జాక్విన్, చెట్టుమాల భాను తేలప్రోలులో వివాహానికి హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనం వెళ్తున్నారు. మార్గం మధ్యలోని ఆరుగొలను వద్ద ఎదురుగా వచ్చిన వ్యాన్ ఢీకొంది. జాక్విన్ అక్కడికక్కడే మృతి చెందారు. భాను తీవ్రంగా గాయపడ్డారు. హనుమాన్ జంక్షన్ పోలీసులు కేసు నమోదు చేసి వ్యాన్ చోదకుడి అరెస్టు చేశారు. అతడికి జైలు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తుది తీర్పునిచ్చారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు.. పెదవేగి, న్యూస్‌టుడే: వేగివాడకు చెందిన వెంకటేశ్వరరావుకు తండ్రి, తమ్ముడితో ఆస్తి తగాదాలున్నాయి. ఈ నెల 23న వివాదం చోటుచేసుకోవడంతో... వెంకటేశ్వరరావు మనస్తాపం చెంది ఇంటి బయటకెళ్లిపోయారు. వివిధ ప్రాంతాల్లో గాలించినా, ఆచూకీ లేకపోవడంతో ఆయన భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై కె.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి.. ఉంగుటూరు, న్యూస్‌టుడే: కంసాలిగుంటలో నిర్వహించిన కోడి పందేలపై శుక్రవారం పోలీసులు దాడి చేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 3 కోడిపుంజులు, 2 కత్తులు, 12 ద్విచక్ర వాహనాలతో పాటు రూ. 3,200 నగదు స్వాధీనం చేసుకున్నారు.

పాత కక్షలతో.. పెదవేగి, న్యూస్‌టుడే: జగన్నాథపురంలో లంకపల్లి రామకోటేశ్వరరావు, లంకపల్లి భాస్కరరావు కుటుంబాల మధ్య మూడేళ్లుగా పాత కక్షలున్నాయి. శుక్రవారం ఉదయం రామకోటేశ్వరరావు ఇంటి నుంచి బయటకు వెళ్తుండగా- భాస్కరరావు అతనిపై దాడి చేసి గాయపరిచాడు. క్షతగాత్రుడ్ని స్థానికులు ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వర్గాల సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.రామకృష్ణ తెలిపారు.

మద్యం సీసాలు స్వాధీనం.. పెదపాడు, న్యూస్‌టుడే: సత్యవోలుకు చెందిన బేత దుర్గాఫణీంద్రబాబు తన ఇంటి వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారు. పోలీసులు శుక్రవారం దాడి చేసి, 30 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. విక్రేతపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌ఛార్జి ఎస్సై కట్టా శారదాసతీశ్ శుక్రవారం తెలిపారు.

స్ఫూర్తి ప్రదాత సత్యనారాయణ



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: సీపీఐ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే వంక సత్యనారాయణ నిరంతర స్ఫూర్తి ప్రదాతని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ కొనియాడారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సత్యనారాయణ ఆరో వర్ధంతి సభ శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సత్యనారాయణ తాను నమ్మిన సిద్ధాంతాల కోసం చివరి శ్వాస వరకూ పోరాడారన్నారు. నాయకులు చలసాని రామారావు, కృష్ణచైతన్య, కొండేటి బేబి, కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ ఆదేశానుసారం జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'సైబర్ నేరాలను అరికట్టడంలో యువత పాత్ర'పై పోటీలు జరగ్గా- పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు ఎస్పీ చేతులమీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

వేతన బకాయిలు చెల్లించాలని ధర్నా

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: ప్రభుత్వ బడుల్లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య డిమాండ్ చేశారు. స్థానిక డీఈవో కార్యాలయం ఎదుట శుక్రవారం కార్మికులతో కలిసి ఆందోళన చేపట్టారు. సోమయ్య మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 1,900 మంది పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. వీరికి మూడు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని ఆయన తెలిపారు.

నేటి నుంచి తెదేపా సభ్యత్వ నమోదు

దుగ్గిరాల(పెదవేగి), న్యూస్‌టుడే: మండలంలో శనివారం చేపట్టనున్న తెదేపా సభ్యత్వ నమోదును ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు బొప్పన సుధాకర్ తెలిపారు. దుగ్గిరాలలోని ఎమ్మెల్యే విడిది కార్యాలయంలో నియోజకవర్గ నాయకులు, మండల కమిటీల క్లస్టర్, యూనిట్ల ఇన్‌ఛార్జులతో శుక్రవారం సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ప్రభాకర్ ఆదేశానుసారం సమావేశం ఏర్పాటు చేశామన్నారు. సభ్యత్వ నమోదులో పార్టీ శ్రేణులు కీలకపాత్ర పోషించాలని ఆయన కోరారు.

ప్రొటోకాల్ పాటించకపోవడం తగదు



మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాసరాజు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించకపోవడం తగదని ఎంపీపీ శ్రీనివాసరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పల్లె పండగలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపనలకు తమను ఆహ్వానించలేదని పలువురు సభ్యులు ప్రస్తావించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. తనను సైతం కొన్ని కార్యక్రమాలకు పిలవలేదని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. జడ్పీటీసీ సభ్యురాలు సరస్వతి, ఎంపీడీవో శ్రీలత, తహసీల్దార్ శ్రీనివాసరావు, డీఆర్‌వో సోమరాజ్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవాల విజయవంతానికి పిలుపు

నారాయణపురం(ఉంగుటూరు), న్యూస్‌టుడే: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) స్వర్ణోత్సవ జిల్లా, రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సమాఖ్య జిల్లా కార్యదర్శి సీహెచ్ శ్రీధర్ పిలుపునిచ్చారు. నారాయణపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం యూటీఎఫ్ మండల శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక, ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. అధ్యక్ష, కార్యదర్శులుగా రాంబాబు, జోగి నాయుడును ఎన్నుకున్నారు.

అవి ఇవి అన్నీ

నైపుణ్యాల పెంపుతో ఉద్యోగావకాశాలు..
ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: స్థానిక సీఆర్ఆర్ మహిళా కళాశాలలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సంపత్ ఇన్ఫో ప్రైవేటు సంస్థ సంచాలకుడు అనిల్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవడం ద్వారా ఉద్యోగావకాశాలు పొందవచ్చన్నారు. హ్యాకింగ్, ఎథికల్ హ్యాకింగ్ మధ్య వ్యత్యాసం వివరించారు. కళాశాల ఉప ప్రధానాచార్యురాలు ఎస్.శబరి కుమారి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందుల పంపిణీ..
పెదపాడు, న్యూస్‌టుడే: గొర్రెల్లో నట్టల నివారణకు మందులు పంపిణీ చేస్తున్నట్లు మండల పశు వైద్యాధికారిణి చావా వాణి సంధ్యశ్రీ తెలిపారు. స్థానిక పశు ఉపగణన కేంద్రంలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ... మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటిని గొర్రెల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జీతాలు చెల్లించాలంటూ వినతి.. ఉంగుటూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు మూణ్నెల్లుగా వేతనాలు ఇవ్వడం లేదని ఆ సంఘం జిల్లా కార్యదర్శి కె.విజయలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక మండల వనరుల కేంద్రం ఎదుట శుక్రవారం నిరసన చేపట్టారు. ఎంఈవో అందుబాటులో లేకపోవడంతో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ నాయకుడు గుత్తికొండ వెంకట కృష్ణారావు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి గురుబ్రహ్మ పురస్కారం..
ఉంగుటూరు, న్యూస్‌టుడే: ఉప్పాకపాడు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు అల్లు శ్రీనివాసరావుకు విశాఖపట్నానికి చెందిన మదర్ థెరిసా ఫౌండేషన్ గురుబ్రహ్మ పురస్కారం ప్రదానం చేసింది. సామాజిక సేవ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం, రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకోవడం తదితర సేవలకు గుర్తుగా పురస్కారం అందజేసినట్లు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.కృష్ణమూర్తి తెలిపారు.



శ్రీనివాసరావు

ముగిసిన శిక్షణ తరగతులు.. ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక గ్రీన్ సిటీలోని లయన్స్ జిల్లా 316జి లీడర్ షిప్ ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిసింది. ఆత్మవిశ్వాసం పెంపు, గుడ్, బాడ్ టచ్, విద్యార్థుల మానసిక వికాసం, భావోద్వేగాల నియంత్రణ తదితరాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. మొదటి, రెండో గవర్నర్లు పాపారావునాయుడు, డాక్టర్ డి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు.. ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: నిడమర్రు మండలం పత్తేపురానికి చెందిన గజ్జల వెంకటేశ్వరరావు, నాలుగేళ్ల బాలుడు భవానీ ద్విచక్ర వాహనంపై ద్వారకాతిరుమల మండలం దొరసానిపాడులోని బంధువుల ఇంటికి వచ్చారు. తిరిగి స్వగ్రామం వస్తుండగా- రాళ్లకుంట వద్ద శుక్రవారం గుర్తు తెలియని వాహనం ఢీకొంది. వారిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు.

పోలవరం

• పోలవరం • చింతలపూడి

రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపిక


అఖిలేష్


సత్యచరణ్

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరంలోని ఓ ప్రైవేటు పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో నిర్వహించిన అండర్-14, 17 త్రోబాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపి.. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో ఎం.అఖిలేష్, 17లో కె.సత్యచరణ్‌లు ఎంపిక కావడంపై శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు అభినందించారు.

అమ్మవార్లకు విశేష పూజలు


గ్రామ దేవత గంగానమ్మ

జంగారెడ్డిగూడెం, పట్టణం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం గ్రామ దేవత గంగానమ్మ ఆలయంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ముత్యాలమ్మ, లలితాదేవి, కనకదుర్గమ్మ, విజయదుర్గమ్మ ఆలయాల్లోనూ విశేష పూజలు నిర్వహించారు. నూకాలమ్మ వెండి చీర తయారీకి సుమారు 22 తులాల వెండిని భక్తులు సమర్పించారు. ✦ పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయం పక్కన ఆలయంలోని ముత్యాలమ్మకు శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు.

నీటిలో ఏర్పాట్లు.. భక్తుల పాట్లు!


నీటిలో పందిరి

పోలవరం, న్యూస్‌టుడే: వచ్చే నెల ఒకటి నుంచి ప్రారంభం కానున్న కార్తిక మాసాన్ని దృష్టిలో పెట్టుకుని పోలవరం మండలం పట్టిసీమ వద్ద గోదావరి మధ్యలోని భద్రకాళి సమేత వీరేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకుని చేస్తున్న ఏర్పాట్లు నీటిలో నానుతున్నాయి. రెండ్రోజుల క్రితం ఆలయ పనులు ప్రారంభించినప్పటికీ రేవు పాటదారుడు నడిచే అవతలి ఒడ్డున భక్తులు సేద తీరేందుకు వేసిన పందిరి నీట మునిగింది. ఒకవైపు లాంచీ ఎక్కేందుకు ఇసుక బస్తాలు వేస్తుండగా.. మరో వైపు రేవులో మెట్ల మార్గం మునిగింది. ప్రస్తుతం నీటిలోనే భక్తులు రాకపోకలు సాగిస్తున్నారు. ధవళేశ్వరం బ్యారేజీ గేట్లు దించడంతో వెనుక భాగంలో నీటి మట్టం పెరిగిందని, రెండ్రోజుల పాటు గోదావరిలో నీటి మట్టం పరిస్థితిని పరిశీలించి.. గుడి రేవులో స్నాన ఘట్టం, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు గదులు ఏర్పాటు చేస్తామని రేవు పాటదారులు చెప్పారు.


రేవులో లాంచి ఎక్కడం కోసం మరొకరి సాయంతో నీళ్లలో నడిచొస్తున్న వృద్ధురాలు

రేవులు ఇలా.. స్నానాలు ఎలా?


అధ్వానంగా బంగారమ్మపేట రేవు

పోలవరం, న్యూస్‌టుడే: కార్తిక మాసంలో పోలవరం మండలంలోని నది పరివాహక ప్రాంతాల్లో స్నానాలు ఆచరించేందుకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వేలాది మంది భక్తులు గోదావరిలో పుణ్యస్నానాలు చేసి, దీపాలు వెలిగించి, పూజలు చేస్తారు. మరో ఆరు రోజుల్లో కార్తిక మాసం ప్రారంభం కానుండగా.. ఇంకా కొన్ని రేవుల్లో అధ్వాన పరిస్థితులు కనిపిస్తున్నాయి. వెస్ట్‌బండ్ నిర్మాణం కారణంగా పోలవరం వాసులు స్థానికంగా స్నానాలు చేసే పరిస్థితి లేక పట్టిసీమ, బంగారమ్మపేట రేవులకు వెళ్తున్నారు. మొన్నటి వరకు వరద కారణంగా బంగారమ్మపేట రేవు మట్టితో నిండిపోయింది. పట్టిసీమ రేవులో అధిక సంఖ్యలో మహిళలు స్నానాలు చేస్తారు. అక్కడ దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక గదుల నిర్మాణం ఇంకా ప్రారంభించలేదు. రేవులో దీపాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా రూ.3 లక్షలతో నిర్మించిన మరుగుదొడ్డి నీటి వసతి లేక నిరుపయోగంగా ఉంది. గత పుష్కరాల సమయంలో గూటాల, కొత్తపట్టిసీమ, పట్టిసీమ రేవుల్లో నిర్మించిన ఘాట్లు మట్టితో నిండాయి. తక్షణం వాటిని శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఇన్‌ఛార్జి ఎంపీడీవో కె.శ్రీనివాస్ మాట్లాడుతూ రేవులను శుభ్రం చేయించి.. భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేస్తామని చెప్పారు.


నిరుపయోగంగా మరుగుదొడ్డి

ఎట్టకేలకు సూచికల ఏర్పాటు

ఈనాడు కథనాలకు స్పందన

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: బయ్యనగూడెంలో జాతీయ రహదారి 516డీ వెంబడి వీధి దీపాలు వెలగక ప్రమాదాలు చోటు చేసుకుంటున్న వైనంపై 'అలంకారమే.. అంధకారం' శీర్షికన గత నెల 18న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ర.భ.శాఖ జాతీయ రహదారుల విభాగం అధికారులు స్పందించారు. గ్రామంలోని రహదారి వెంబడి విభాజకం రెండు వైపులా హెచ్చరిక సూచికలను ఏర్పాటు చేసినట్లు ఏఈఈ ఖాజాబాబు గురువారం తెలిపారు. వీధి దీపాల నిర్వహణ కొద్ది రోజుల్లో మెరుగుపరుస్తామన్నారు.

విద్యుత్తు సమస్యల పరిష్కారం.. **టి.నరసాపురం, న్యూస్‌టుడే:** బొర్రంపాలెంలో విద్యుత్తు సరఫరాకు తరచూ అంతరాయం కలిగిస్తున్న చెట్ల కొమ్మలను సిబ్బంది తొలగించారు. ఈ సమస్యపై 'ఈనాడు'లో 'నరికారు వదిలేశారు' శీర్షికన శుక్రవారం ప్రచురితమైన కథనానికి ఏఈ శ్రావణ్‌కుమార్ స్పందించారు. సిబ్బందితో చెట్ల కొమ్మలను తొలగించారు.

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: 'అల్లుకుపోతున్నా.. అటు చూడరే!' శీర్షికన ఈ నెల 24న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి బయ్యనగూడెం విద్యుత్తు ఏఈ పి.సాంబయ్య స్పందించారు. సిబ్బంది సాయంతో స్తంభానికి అల్లుకున్న పాదులను శుక్రవారం తొలగించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు చేరిన గుడ్లు.. **పోలవరం, న్యూస్‌టుడే:** పోలవరం మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు ఎట్టకేలకు గుడ్లు చేరాయి. ఈ సమస్యపై 'ఈనాడు'లో గురువారం 'పప్పుచారుతో సరి' 'అంగన్‌వాడీ కేంద్రాలకు చేరని గుడ్లు' శీర్షికన ప్రచురితమైన కథనానికి కొయ్యలగూడెం ఇన్‌ఛార్జి సీడీపీవో తులసి స్పందించారు. పోలవరం ఎంపీయూపీ పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. ఆ సమయంలో గుడ్ల లోడుతో వాహనం రావడంతో దగ్గరుండి దిగుమతి చేయించారు. కొయ్యలగూడెం ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు గుడ్లు సరఫరా చేసినట్లు పేర్కొన్నారు.


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సృజనకు పదును!

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో శుక్రవారం జంగారెడ్డిగూడెం అక్షర కాన్సెప్ట్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో ప్రతిభా పాటవ పోటీ నిర్వహించారు. 'అంతర్జాలంతో లాభనష్టాలు- విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అన్న అంశంపై పోటీ నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రథమ స్థానంలో జొన్నకూటి షర్మిళ, ద్వితీయ కొండపల్లి అభినవ్, తృతీయ స్థానంలో తెల్లం బిందుమాధవి నిలిచారు. వీరికి పాఠశాల డైరెక్టర్ కామారు నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ ఆనంద్‌రాజు బహుమతులు అందజేశారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాగేశ్వరరావు, ఆనంద్‌రాజు

కేసుల దర్యాప్తులో నిర్లక్ష్యం తగదు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని డీఎస్పీ యు.రవిచంద్ర అన్నారు. జంగారెడ్డిగూడెంలోని ఆయన కార్యాలయంలో నెలవారీ నేర సమీక్షలో భాగంగా సబ్‌డివిజన్‌లోని సీఐలు, ఎస్సైలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసుల దర్యాప్తులో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. ప్రజాశాంతికి భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. సమావేశంలో జంగారెడ్డిగూడెం, చింతలపూడి సీఐలు కృష్ణబాబు, రవీంద్రనాయక్, సబ్ డివిజన్‌లోని ఎస్సైలు పాల్గొన్నారు.

నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి.. **జీలుగుమిల్లి, న్యూస్‌టుడే:** నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలవరం డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. జీలుగుమిల్లి పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం సబ్ డివిజన్‌లోని అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో నిరంతర నిఘా ఏర్పాటు చేయాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేస్తామని చెప్పారు. పల్లెల్లో జూదాలను అరికట్టేందుకు సిబ్బందితో నిత్యం గస్తీ నిర్వహిస్తామన్నారు. సమావేశంలో జీలుగుమిల్లి, పోలవరం, బుట్టాయగూడెం, కుక్కునూరు సీఐలు బి.వెంకటేశ్వరరావు, బాలసురేష్, రమేష్‌బాబు, ఎస్సైలు నవీన్‌కుమార్, చంద్రశేఖర్, జయబాబు, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.


సమీక్షిస్తున్న డీఎస్పీ రవిచంద్ర

పేదల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

లింగపాలెం, న్యూస్‌టుడే: పేదల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అన్నారు. శుక్రవారం కొత్తపల్లిలో కనకదుర్గమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ, ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ విచ్చేశారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీకి రూ.50 వేలు విరాళాన్ని ఎంపీ మహేశ్‌కుమార్ అందజేశారు. ముందుగా కొత్తపల్లిలో స్థానిక తెదేపా నాయకుడు శాఖమూడి శ్రీను ఇంటి వద్ద ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో సీసీ రహదారులు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. పల్లపుబజారులో బీసీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.10 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారు. ✦ రంగాపురంలో అఖిల భారత పశుగణన కార్యక్రమ కరపత్రాలను ఎంపీ మహేశ్ ప్రారంభించారు.


పశుగణన కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎంపీ మహేశ్‌కుమార్

వినతుల వెల్లువ

కామవరపుకోట (జంగారెడ్డిగూడెం), న్యూస్‌టుడే: మండల కేంద్రమైన కామవరపుకోటలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీలు వెల్లువెత్తాయి. ఎమ్మెల్యే రోషన్‌కుమార్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 1079 అందగా.. రెవెన్యూ సమస్యలకు సంబంధించి 590, గృహ నిర్మాణం, పింఛన్లు 477, వైద్య శాఖ 4, పోలీసు 5, విద్యుత్తు సమస్యలకు సంబంధించి 3 దరఖాస్తులు అందాయని ఎమ్మెల్యే తెలిపారు. వీటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. తహసీల్దార్ ఎలీషా, ఎంపీడీవో సరళకుమారి, ఎస్‌ఐ చెన్నారావు, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, తెదేపా మండల అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ, కూటమి నాయకులు కోనేరు వెంకటసుబ్బారావు, తూతా లక్ష్మణరావు, బాబ్జి, బాలవర్ధిరాజు, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.


అర్జీలు పరిశీలిస్తున్న రోషన్ కుమార్

ఓటు హక్కు నమోదు, వినియోగం బాధ్యత.. **చింతలపూడి, న్యూస్‌టుడే:** వచ్చే నెల 6లోగా ఎమ్మెల్సీ ఎన్నికలు సంబంధించిన ఓటర్ల నమోదు గడువు పూర్తవుతున్నందున పట్టభద్రులంతా ఓటర్లుగా నమోదు కావాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. మండలంలోని ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు ఇతర ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు పట్టభద్రుల ఓట్ల నమోదుపై స్థానిక ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో అవగాహన కల్పించారు. ఓటరుగా నమోదు కావడం, ఓటు హక్కు వినియోగించుకోవడం ఒక బాధ్యత అని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

గ్రామాల సమగ్ర అభివృద్ధికి పెద్దపీట


గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలరాజు

జీలుగుమిల్లి, న్యూస్‌టుడే: గ్రామాల సమగ్ర అభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం పెద్ద పీట వేసిందని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. మండలంలోని దిబ్బగూడెంలో సిమెంటు రహదారికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. గ్రామస్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు అందిస్తూ పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేస్తూ ప్రజా ప్రభుత్వంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు జి.రవికుమార్, పి.రాము, చాపా రవి, పంచాయతీరాజ్ డీఈ సీతయ్య పాల్గొన్నారు.

ఎస్సైలకు పురస్కారాలు


డీఎస్పీ వెంకటేశ్వరరావు నుంచి రివార్డు అందుకుంటున్న నవీన్‌కుమార్


జీలుగుమిల్లి, న్యూస్‌టుడే: విధుల్లో ప్రతిభ కనబర్చిన ఇద్దరు ఎస్సైలకు పోలవరం డీఎస్పీ వెంకటేశ్వరరావు శుక్రవారం రివార్డులు అందించారు. జీలుగుమిల్లి పోలీస్ స్టేషన్‌లో జరిగిన నేర సమీక్షలో ఇటీవల కోడి పందేలు, జూద స్థావరాలపై దాడులు చేసి నియంత్రించిన జీలుగుమిల్లి ఎస్సై నవీన్‌కుమార్, టి.నరసాపురం ఎస్సై జయబాబులకు రివార్డు నగదును ఆయన ఇచ్చారు. విధుల్లో చిత్తశుద్ధి కనబర్చి నేరాలపై ఉక్కుపాదం మోపాలని సూచించారు. కార్యక్రమంలో సీఐలు వెంకటేశ్వరరావు, బాలసురేష్, రమేష్‌బాబు పాల్గొన్నారు.

నేటి నుంచి తెదేపా సభ్యత్వాలు



కుక్కునూరు, న్యూస్‌టుడే: ప్రత్యేక యాప్ ద్వారా తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం నుంచి ప్రారంభం కానుంది. పోలవరం నియోజకవర్గానికి సంబంధించి ఆ కార్యక్రమాన్ని బుట్టాయగూడెంలోని కార్యాలయంలో ఏపీ ట్రైకార్ ఛైర్మన్, పార్టీ నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు ప్రారంభిస్తారని తెదేపా వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. అనంతరం ప్రతి మండలం, గ్రామ స్థాయిలో సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమవుతుంది. ఇందు కోసం రెండు వాట్సప్ సంఖ్యలను కేటాయించారు. వాటి ద్వారా ఎవరికి వారు సభ్యులుగా చేరే అవకాశం కల్పించారు.

విలీన మండలాలకు ప్రత్యేక విద్యుత్తు లైను


వివరాలు వెల్లడిస్తున్న నాగేశ్వరరావు

కుక్కునూరు, న్యూస్‌టుడే: విలీన మండలాల్లో అంతరాయాలు, అల్ప విద్యుత్తు సమస్య పరిష్కారానికి అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక నుంచి ప్రత్యేక లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ తమకు సమాచారం ఇచ్చారని తెదేపా మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు తెలిపారు. శనివారం కుక్కునూరులోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు జంగారెడ్డిగూడెం ఉపకేంద్రం నుంచి 132/33కేవీ సరఫరా జరుగుతోంది. దూరం కారణంగా తరచూ సరఫరాలో అంతరాయం, అల్ప విద్యుత్తు సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. వాటి పరిష్కారానికి చేసిన ప్రతిపాదనలకు ఆమోదం లభించినట్లు ఎంపీ తెలిపారని నాయకులు వివరించారు. ఇందు కోసం గోదావరి నదిపై నాలుగు టవర్లు నిర్మించే పనులు ప్రారంభమవుతాయన్నారు. పోలవరం పునరావాసంలో దొర్లుతున్న తప్పులను కలెక్టర్ దృష్టికి ఎంపీ తీసుకెళ్లగా, 2019లో రూపొందిన జాబితాల ప్రకారం ఆర్‌అండ్‌ఆర్ ప్రక్రియ పూర్తిచేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు వివరించారు. సమావేశంలో నాయకులు కోటగిరి సత్యనారాయణ, వెంకటరమణ, పులి శ్రీను, బొల్లు కృష్ణ, వెంకన్న, విశ్వేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

దారి చూపిన నిర్వాసితుడు!


జేసీబీతో మరమ్మతులు


మిరియాల పుల్లారావు

తాడువాయి (జంగారెడ్డిగూడెం పట్టణం), న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి పంచాయతీ చల్లావారిగూడెం పునరావాస కాలనీ రహదారి వర్షాలకు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. అటుగా రాకపోకలు సాగించాలంటేనే భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విషయమై నిర్వాసితులు అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదు. దీంతో వేలేరుపాడు మండలం జగన్నాథపురానికి చెందిన మిరియాల పుల్లారావు అనే నిర్వాసితుడు రూ.25 వేలతో ఇరువైపులా కాలువ తవ్వి కోతకు గురైన రోడ్డుకు యంత్రాల సాయంతో మరమ్మతులు చేయించారు. సుమారు 750 కుటుంబాలకు దారి చూపాడు. అధికారులు చేయలేని పనిని ఓ నిర్వాసితుడు ముందుకొచ్చి చేయడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగాలకు ఎంపిక

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం రామచంద్ర విద్యా సంస్థల్లో శుక్రవారం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహించారు. వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొని నిరుద్యోగులకు ముఖాముఖి నిర్వహించారు. సుమారు 107 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధి కిశోర్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఏవో కె.రమేశ్, ప్రిన్సిపల్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అవి ఇవి అన్నీ


తాగునీటి సరఫరా ప్రారంభం.. **కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే:** కొయ్యలగూడెం బీసీ కాలనీలో లివింగ్ శాక్రిఫైస్ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సంస్థ రూ.5 లక్షలతో నిర్మించిన తాగునీటి బోరు, మినీ ట్యాంకును సర్పంచి ముప్పిడి విజయకుమారి శుక్రవారం ప్రారంభించారు.

పశుగణన ప్రక్రియలో అప్రమత్తత అవసరం.. **కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే:** మండలంలో పశుగణన ప్రక్రియను ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కొయ్యలగూడెం పశువుల ఆసుపత్రి వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పశువుల వివరాలను సంబంధిత యాప్‌లో నమోదు చేసే క్రమంలో అప్రమత్తంగా వ్యవహరించాలని ఎన్యూమరేటర్లుగా నియమితులైన సచివాలయ సహాయకులకు సూచించారు. ఈ సందర్భంగా వారికి కిట్లను అందజేసి గోడపత్రాలను ఆవిష్కరించారు. పశువైద్యాధికారి శ్రీనివాసన్ మాట్లాడుతూ వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలాఖరుకు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.

'ఆధ్యాత్మిక భావం పెంపొందించుకోవాలి'.. **బుట్టాయగూడెం, న్యూస్‌టుడే:** ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించుకోవాలని వాసవీ క్లబ్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామ్మోహనరావు కోరారు. చింతలగూడెం సమీపాన పోగొండ ప్రాజెక్టు వద్ద చెవిటి ముక్కమ్మ గుడికి నిమ్మలగూడేనికి చెందిన వాసవీ క్లబ్ జోన్ ఛైర్మన్ తుమ్మలపెంట జగన్నాథం, వాసవి దంపతుల ద్రవ్య సహాయంతో ఏర్పాటు చేసిన ఇనుప మెస్, గేట్లను శుక్రవారం ఆయన ప్రారంభించారు. శ్రీధరాల మాధవి, వెత్సా భవానీలు విద్యుత్తు పంకాలు బహూకరించారు.

అద్దయ్య సేవలు అభినందనీయం.. **జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే:** విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసిన వ్యక్తి ఆర్డీవో కె.అద్దయ్య అని జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర అన్నారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో బదిలీపై వెళుతున్న ఆర్డీవో కె.అద్దయ్య(ప్రభుత్వానికి రిపోర్టు చేయాలి) అభినందన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ... ప్రజాసమస్యల పరిష్కారంలో విశేష కృషి చేశారని కొనియాడారు. అనంతరం అద్దయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం, చింతలపూడి సీఐలు కృష్ణబాబు, రవీంద్రనాయక్, ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.

'విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి'.. **బుట్టాయగూడెం, న్యూస్‌టుడే:** డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని ఆ పథకం ఏడీ ఎండీ షరీఫ్ ఆదేశించారు. ఆ పథకం అమలుపై మండలంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో బుట్టాయగూడెం ఎంపీడీవో కార్యాలయం వద్ద సమీక్షా సమావేశం నిర్వహించారు. నిర్దేశించిన ఆహార పట్టికను కచ్చితంగా అమలు చేయాలన్నారు. ఎంఈవో-1, 2లు తెల్లం బాబూరావు, నరేంద్రరాయ్, రిసోర్స్‌పర్సన్ శాస్త్రి పాల్గొన్నారు.


ఏడీ షరీఫ్‌కు వినతిపత్రం అందజేసిన నాయకులు, కార్మికులు

వేతన బకాయిలు చెల్లించాలని ధర్నా

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: తమకు వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు బుట్టాయగూడెం మండల విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా చేశారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మొడియం నాగమణి మాట్లాడుతూ కార్మికులకు వేతన బకాయిలు చెల్లించడంతో పాటూ పారిశుద్ధ్య పనులు చేసేందుకు అవసరమైన సామగ్రిని సరఫరా చేయాలని కోరారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం ఏడీ షరీఫ్‌కు వినతిపత్రం అందజేశారు.

అదృశ్యమైన యువకుడి మృతదేహం గుర్తింపు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల మండలం జి.కొత్తపల్లిలో అదృశ్యమైన యువకుడు ఊర చెరువులో శవమై తేలాడు. కామవరపుకోట మండలం ఆడమిల్లికి చెందిన స్వర్ణాల వినోద్‌కుమార్(32) కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంత కాలంగా అత్తగారి గ్రామం జి.కొత్తపల్లికి వచ్చి అద్దె ఇంట్లో ఉంటున్నాడు. ఈ నెల 23న సాయంత్రం కూలి డబ్బులు కోసం వెళుతున్నానని చెప్పి.. ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వినోద్‌కుమార్‌కు చెందిన చెప్పులు, ద్విచక్రవాహనం, చరవాణి స్థానిక ఊర చెరువు గట్టుపై గుర్తించిన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టడంతో మృతదేహం కనిపించింది. దీనిపై అనుమానాస్పద స్థితిలో మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధీర్ తెలిపారు. శవాన్ని పరీక్ష నిమిత్తం జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వినోద్‌కుమార్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల మండలం రాళ్లకుంట వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బాలుడు, వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. నిడమర్రు మండలం పత్తేపురానికి చెందిన గజ్జల వెంకటేశ్వరరావు, భవానీ అనే నాలుగేళ్ల బాలుడు ద్విచక్ర వాహనంపై ద్వారకాతిరుమల మండలం దొరసానిపాడులోని బంధువుల ఇంటికి వచ్చారు. తిరిగి స్వగ్రామం వెళ్తుండగా సంఘటనా స్థలం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. అటువైపు వస్తున్న ప్రయాణికులు వారిని తొలుత ద్వారకాతిరుమల పీహెచ్‌సీకి, అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం 108 వాహనంలో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వరుస చోరీలతో ఆందోళన

పోలవరం, న్యూస్‌టుడే: మండలంలోని చేగొండపల్లి పంచాయతీ పరిధి సింగన్నపల్లి పునరావాస కాలనీలో శుక్రవారం నిర్వాసితుల ఇళ్లలో దొంగతనాలు చోటు చేసుకోవడంపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వారంతా ఉపాధి పనులకు వెళ్లిన సమయంలో ఈ ఘటనలు చోటు చేసుకున్నాయని, కొంత బంగారంతో పాటు నగదు ఎత్తుకు వెళ్లినట్లు చెబుతున్నారు. దీనిపై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ, ఎస్సైలు బాలసురేశ్‌బాబు, పవన్‌కుమార్‌లు సిబ్బందితో కాలనీని సందర్శించి వివరాలు సేకరిస్తున్నారు.

జూద శిబిరంపై దాడి

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: గవరవరంలో జూద స్థావరంపై శుక్రవారం దాడి చేసి, ముగ్గురిని అదుపులోకి తీసుకుని, రూ.2500, మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కె.చంద్రశేఖర్ తెలిపారు.

మద్యం సీసాలు స్వాధీనం

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం మండలం మైసన్నగూడెంలో కుక్కల రవిబాబు వద్ద 10, పేరంపేటలో మరీదు వెంకట్ వద్ద 8 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనుబాబు శుక్రవారం తెలిపారు. ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

'చిరుద్యోగులపై ప్రతాపం చూపొద్దు'

చింతలపూడి, న్యూస్‌టుడే: స్కీం వర్కర్లపై అధికార పార్టీ నాయకులు తమ ప్రతాపం చూపొద్దని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్వీఎస్ నారాయణ అన్నారు. సీఐటీయూ మండల సమావేశం చింతలపూడిలోని ప్రజా సంఘాల కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల పరిధిలో పదేళ్ల నుంచి తక్కువ జీతానికి స్కీం వర్కర్లు పనిచేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక చాలా మందిని తొలగించి అధికార పార్టీకి చెందిన వారితో భర్తీ చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి


సరస్వతీ మాత విగ్రహాన్ని ఆవిష్కరించిన రాంబాబు

టి.నరసాపురం, న్యూస్‌టుడే: విద్యార్థులు మహనీయులను ఆదర్శంగా తీసుకుని జీవితంలో ముందుకు సాగాలని చింతలపూడి ఎంపీపీ రాంబాబు అన్నారు. బండివారిగూడెం ప్రాథమికోన్నత పాఠశాలకు ఆయన బహూకరించిన సరస్వతీ మాత విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా సర్పంచి టిరీష మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. నేలపాటి శ్రీకరల్ పాఠశాలకు మదర్‌థెరీసా, నాళం పురుషోత్తం సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాలను అందించారు. నాళం సునీల్ విద్యార్థులకు రాత పుస్తకాలు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు డి.బాజా, మనీషా, కాశీ, జాకీర్ పాల్గొన్నారు.

నూజివీడు

• నూజివీడు • కైకలూరు

ఉద్యోగ మేళాతో యువతకు ఉపాధి



ముఖాముఖి నిర్వహిస్తున్న ప్రతినిధులు

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: నూజివీడు పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, స్కిల్ హబ్ సంయుక్త ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి చల్లా మధుసూదనరావు మాట్లాడుతూ పదో తరగతి నుంచి పీజీ వరకు విద్యార్హతలున్న యువతకు జాబ్ మేళా ఉపయోగపడుతుందన్నారు. వరుణ్ మోటార్స్, క్రాంతి ట్రాన్స్‌పోర్ట్, ఏయూ బ్యాంక్, టీం లీజ్, మెడ్‌ప్లస్ ఫార్మా కంపెనీల ప్రతినిధులు ముఖాముఖి నిర్వహించారు. ఐటీఐ ప్రిన్సిపల్ భూషణం, కోఆర్డినేటర్లు రవి శ్యామ్, సురేశ్, రామకృష్ణనాయుడు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

చాట్రాయి, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులు దూరమవుతాయని వైద్య ఆరోగ్య శాఖ సబ్ యూనిట్ అధికారి యలమంద తెలిపారు. చాట్రాయి మండలం తుమ్మగూడెం గ్రామంలో డ్రై డే నిర్వహించారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో దోమలు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. హెల్త్ అసిస్టెంట్ ఎన్.వెంకటస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

పురపాలక మండలి సమావేశం నేడు

నూజివీడు పట్టణం: నూజివీడు పురపాలక సంఘ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో శనివారం కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించనున్నట్లు పురపాలక కమిషనర్ ఆర్.వెంకట రామిరెడ్డి తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నూజివీడు: 99486 40551	కైకలూరు: 73060 88555
ముసునూరు: 93983 81268	కలిదిండి: 90594 84862

కైకలూరు, న్యూస్‌టుడే

సమస్య: కైకలూరు 2 వార్డులోని మసీదు కాడలి నుంచి విద్యుత్తు కార్యాలయానికి వచ్చే మార్గంలో పంచాయతీ వీధి దీపాలు కొన్ని రోజులుగా వెలగడం లేదు. రాత్రి వేళల్లో రాకపోకలు సాగించే స్థానికులు అవస్థలు పడుతున్నారు. **- శ్యామ్ ప్రసాద్, కైకలూరు**

సమాధానం: వెలగని వీధి దీపం స్థానంలో కొత్త ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తాం. **- వి.కొండలరావు ఈవోపీఆర్డీ**

కనక దుర్గమ్మకు ప్రత్యేక పూజలు



ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లి రుద్ర భూమి సమీపంలోని స్వయంభూ దేవాలయమైన కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో ఆశ్వయుజ మాస బహుళ నవమి శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, గణపతి పూజ, లలితా సహస్ర నామ కుంకుమార్చన, ప్రత్యేక పూజలను వైభవంగా నిర్వహించారు.

అసంపూర్తి భవనాలు వరండాలోనే చదువులు..

మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి మండలం పుట్లచెరువు జడ్పీ ఉన్నత పాఠశాలలో తరగతి గదుల కొరతతో చిన్నారులు వరండాలోనే చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మరోపక్క 'నాడు నేడు'లో మంజూరైన భవనాలు అసంపూర్తిగా నిర్మించడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రాథమిక పాఠశాలలో చదివే 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలలో కలపడంతో ఉన్నత పాఠశాలలో తరగతి గదులు కొరత ఏర్పడింది. దీంతో నాలుగో తరగతి చిన్నారులను తరగతి గదిలో 8వ తరగతి చిన్నారులను వరండాలో పెట్టి విద్యా బోధన చేయాల్సిన దుస్థితి పట్టింది. రెండు తరగతులను ఒకేచోట నిర్వహించడం వల్ల విద్యార్థులు పాఠ్యాంశాలపై శ్రద్ధ పెట్టలేకపోతున్నారు. నాడు-నేడుతో పాఠశాలల స్థితిగతులను మార్చుతామని ఊక దంపుడు ప్రసంగాలతో ఊదరగొట్టిన గత వైకాపా ప్రభుత్వం వల్ల చిన్నారులకు ఈ పరిస్థితి నెలకొంది. అనుకున్న స్థాయిలో నిధులు మంజూరు చేయకపోవడంతో భవనాలు శ్లాబ్ స్థాయికి వచ్చి నిలిచిపోయాయి. మరోపక్క ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు లేక రెండు తరగతి భవనాలు ఖాళీగా ఉన్నాయని ఉపాధ్యాయులు తెలిపారు. దీనిపై ఇంజినీరింగ్ సహాయకుడు హేమంత్‌ను వివరణ కోరగా జడ్పీ పాఠశాలలో రూ.96 లక్షలతో నాలుగు తరగతి గదులు నిర్మించాలని అంచనా వేశామన్నారు. నిధులు లేక నిర్మాణాలను నిలిపేశామని తెలిపారు.



పుట్లచెరువులో వరండాలో కూర్చున్న విద్యార్థులు వెనుక అసంపూర్తి తరగతి భవనం

ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ..

చాట్రాయి, న్యూస్‌టుడే: నాడు-నేడులో పాఠశాలల్లో సకల వసతులు కల్పిస్తామంటూ వైకాపా ప్రభుత్వంలో హడావుడి చేసినా విద్యార్థులకు అవసరమైన వసతుల కల్పనలో విఫలమైంది. ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులు దూర ప్రాంతాల నుంచి వస్తుంటారు. వీరు సైకిళ్లపై రాకపోకలు సాగిస్తారు. పాఠశాలల్లో సైకిళ్లకు షెడ్లు అందుబాటులో లేకపోవడంతో చెట్ల నీడలో ఉంచుతున్నారు. కొన్ని పాఠశాలల్లో ఆరుబయట ఎండలో ఉంటున్నాయి. చాట్రాయి, చిన్నంపేట, సి.గుడిపాడు, మర్లపాలెం, పోలవరం, చిత్తపూరు ఉన్నత పాఠశాలల్లో సైకిల్ స్టాండ్ లేవు. పోలవరంలో దాత నిర్మించినా ఇంకా అసంపూర్తిగా ఉంది. చిన్నంపేట ఉన్నత పాఠశాలకు కోటపాడు, పోలవరం ఉన్నత పాఠశాలకు పోతనపల్లి గ్రామాల నుంచి విద్యార్థులు వస్తుంటారు. చనుబండ ఉన్నత పాఠశాలకు ఎన్టీఆర్ జిల్లా కొర్లమండ నుంచి బాలికలు సైకిళ్లపై వస్తారు. వీరంతా అయిదారు కిలో మీటర్లు ప్రయాణాలు చేస్తూ వస్తున్నారు పాఠశాలల్లో వీటికి రక్షణ లేకుండా పోయాయి.



దీంతో ఇవి ఎండకు ఎండుతూ.. వానలకు తడుస్తూ ఉన్నాయి. ఎండలో సైకిళ్లకు గాలి పోతే ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి దయనీయంగా మారుతుంది. ఎండా వానలకు తరచూ మరమ్మతులకు గురవుతున్నట్లు విద్యార్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సైకిల్ షెడ్లు నిర్మించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇదే విషయంపై ఎంఈవో వీఎస్వీ బ్రహ్మాచారిని వివరణ కోరగా సైకిల్ షెడ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని ఆయన తెలిపారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవాల విజయవంతానికి పిలుపు

నారాయణపురం(ఉంగుటూరు), న్యూస్‌టుడే: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) స్వర్ణోత్సవ జిల్లా, రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సమాఖ్య జిల్లా కార్యదర్శి సీహెచ్ శ్రీధర్ పిలుపునిచ్చారు. నారాయణపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం యూటీఎఫ్ మండల శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక, ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. మండల అధ్యక్ష, కార్యదర్శులుగా ఉనుముల రాంబాబు, డాకి జోగి నాయుడు, గౌరవాధ్యక్షుడిగా శీతాల సత్యనారాయణ, కోశాధికారిగా ఊట ఆనంద్ కుమార్, ఉపాధ్యక్షులు కత్తుల రూఫ్సీ, తూతిక శివయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: నూజివీడు పట్టణంలోని ఎస్.ఆర్.ఆర్. జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల సమావేశ మందిరంలో పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ పి.సత్య శ్రీనివాస్ మాట్లాడుతూ తెలిసీ తెలియని వయసులో చేసే తప్పులు నేరాలకు దారి తీస్తాయన్నారు. రేపటి పౌరులుగా ఎదగాల్సిన విద్యార్థులు నేర ప్రవృత్తికి ఆకర్షితులైతే బంగారు భవిత బుగ్గిపాలు కాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ భాగవతుల హేమలత తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ విధులపై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న పట్టణ సి.ఐ. సత్య శ్రీనివాస్

వ్యాస రచన పోటీలు.. కలిదిండి, న్యూస్‌టుడే: పోలీసు అమర వీరుల వారోత్సవాలను పురస్కరించుకుని ప్రభుత్వ, ప్రైవేటు బడుల్లోని చిన్నారులకు శుక్రవారం వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఎస్సై వెంకటేశ్ మాట్లాడుతూ 'సైబర్ నేరాల నియంత్రణలో యువత పాత్ర' అనే అంశంపై పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీనిలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారన్నారు. జిల్లా, మండల స్థాయిలో విజేతలను ఎంపిక చేసి ఉన్నతాధికారుల చేతుల మీదుగా బహుమతులను అందిస్తారని వివరించారు.

శంకుస్థాపనలే కాదు.. పనులూ వేగవంతం

మండవల్లి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలో శంకుస్థాపనలే కాకుండా పనులు సైతం వేగంగా నిర్వహిస్తున్నారు. అందుకు నిదర్శనం మండవల్లి మండలం పెరికెగూడెంలో ఈ నెల 18న పల్లె పండగ పేరుతో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఇప్పటికే పనులు సైతం ప్రారంభించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మొత్తం 200 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.14 లక్షలు నిధులు మంజూరు చేశారు. మరో 20 మీటర్ల రోడ్డును పంచాయతీ నిధులతో నిర్మాణం చేపట్టనున్నారు. సీసీ రోడ్డు నిర్మాణం పనులు కూటమి నాయకులు ఎలికే రాంబాబు, ఆంజనేయులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.



పెరికెగూడెంలో మొదలైన సీసీ రోడ్డు పనులు

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

ముదినేపల్లి, న్యూస్‌టుడే: జగ్గయ్యపేటలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 కబడ్డీ పోటీల్లో అల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని నీలిపల్లి ఆశ్లేష ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్.ఎం. ఎస్.రామోజీ తెలిపారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఈ నెల 27 నుంచి నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి పాల్గొంటుందని ఆయన చెప్పారు.



విద్యార్థిని అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

తెదేపా సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా

కైకలూరు, న్యూస్‌టుడే: తెదేపా సభ్యత్వం నమోదు చేసుకుంటే కార్యకర్తల కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తుందని నియోజకవర్గ తెదేపా కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు అన్నారు. శనివారం నుంచి తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమవుతున్న తరుణంలో మండల తెదేపా అధ్యక్షుడు పి.త్రినాథ రాజు ఆధ్వర్యంలో స్థానిక ట్రావెలర్స్ బంగ్లాలో శుక్రవారం నాలుగు మండలాల పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. రూ.వందతో సభ్యత్వం తీసుకుంటే రూ.5 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని, సహజ మరణం సంభవిస్తే రూ.10 వేలతో పాటు విద్యా, వైద్య సేవలు కల్పించేలా పార్టీ అధిష్ఠానం తీసుకున్న నిర్ణయం హర్షణీయమన్నారు. రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ రూపకల్పన చేసిన ఈ కార్యక్రమం కార్యకర్తలతో పాటు పేద వర్గాలకు అండగా ఉంటుందని తెలిపారు. నాయకులు బలే ఏసురాజు, నారగాని వెంకట నాగేశ్వరరావు, పోసిన పాండురంగారావు, కె.కె.బాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమ్మిలి, వీరమల్లు

భీమడోలులో రైళ్ల నిలుపుదలకు వినతి

భీమడోలు, న్యూస్‌టుడే: భీమడోలు రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదలకు సహకరించాలని పలువురు తెదేపా నాయకులు కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులుతో కలిసి కురెళ్లగూడెంలో ఎంపీ మహేశ్ కుమార్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. భీమడోలుకు ద్వారకాతిరుమల క్షేత్రం కేవలం 16 కిలోమీటర్ల దూరంలోనే ఉందని చెప్పారు. యాత్రికులు, ప్రయాణికుల సౌకర్యార్థం రత్నాచల్, జన్మభూమి, గౌతమి, శిర్డీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలుపుదలకు తోడ్పాటునందించాలని వారు కోరారు. నాయకులు హరీశ్, పెద్దిరాజు, రామతులసమ్మ, సుబ్రహ్మణ్యం, నాగ గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రంలో డ్రిప్ కంపెనీలతో సమీక్ష

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: నూజివీడు మండలం తుక్కులూరు గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో శుక్రవారం ఏపీ సూక్ష్మ బిందు సేద్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో డ్రిప్ కంపెనీలు, సిబ్బందితో రివ్యూ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూక్ష్మ, బిందు సేద్య ప్రాజెక్టు ఏలూరు జిల్లా డైరెక్టర్ పి.రవికుమార్ మాట్లాడుతూ నూజివీడు మండలానికి 800 హెక్టార్ల లక్ష్యంగా నిర్ణయించినట్లు చెప్పారు. డ్రిప్ అవసరం ఉన్న ప్రతి రైతుకు పథకాన్ని అందుబాటులోకి తీసుకురావాలన్నారు. చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. ఐదు ఎకరాలు పైబడిన రైతులకు 50 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు.

27న ఉచిత వైద్య శిబిరం

ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు మండలం చెక్కపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 27న ఉయానా మోనాస్ట్రీ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్టు ఛైర్మన్ సత్యనారాయణరాజు శుక్రవారం తెలిపారు. ఈ శిబిరంలో అన్ని రకాల ఆరోగ్య సమస్యలకు చికిత్స అందిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సినిమాలు

నూజివీడు పట్టణం

సత్యనారాయణ	**దేవర**
సత్యనారాయణ మినీ	**జనక అయితే గనక**
ద్వారక సినిమాస్ స్క్రీన్ 1	**వీనం**
ద్వారక సినిమాస్ స్క్రీన్ 2	**విశ్వం**
ద్వారక సినిమాస్ స్క్రీన్3	**వేట్టయన్**
ఆగిరిపల్లి: శ్రీఅను డీలక్స్	**మార్టిన్**
కైకలూరు	
విజయలక్ష్మి జీ3 సినిమాస్	**దేవర**
మాగంటి సినిమాస్	**వేట్టయన్**
శ్రీవెంకటరమణ సినిమాస్	**వెనమ్**
ముదినేపల్లి: పూర్ణిమ	**దేవర**

ఇల్లెక్కిన పడవ

కైకలూరు, న్యూస్‌టుడే: ఏంటీ చెరువులో ఉండాల్సిన పడవను ఇంటిపై పెట్టుకున్నారు అనుకుంటున్నారా.. అయితే మీరు పొరబడినట్లే... ఇది ఆక్వా రొయ్యలు, చేపల చెరువుల్లో మేతలు చల్లేందుకు వినియోగించే నాటు పడవ కాదండి.. సిమెంటుతో నిర్మించిన మంచి నీటి ట్యాంకు. కైకలూరు-ఏలూరు రోడ్డులోని విజ్ఞాన్ కళాశాల సమీపంలో ఓ ఇంటి యజమాని మచ్చటతో ఇలా పడవ ఆకారంలో తాగు నీటి ట్యాంకు నిర్మించుకున్నారు. అకస్మాత్తుగా చూసిన వారికి నిజమైన పడవలా కనిపించడంతో ప్రజలు ఆసక్తిగా చూస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం 'న్యూస్‌టుడే' కెమెరా క్లిక్ మనిపించింది.



ప్రారంభించారు.. వదిలేశారు..!?

పోతనపల్లిలో ఆరోగ్య కేంద్రం

చాట్రాయి, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాలకు ఆరోగ్య సేవలను విస్తరిస్తామని, ఆధునిక వైద్య సదుపాయాలు ప్రజలకు చేరువవుతాయని వైకాపా పాలనలో గొప్పలు చెప్పు కున్నా.. క్షేత్ర స్థాయిలో నిరుపయోగ భవనాలు వెక్కిరిస్తున్నాయి. పోతనపల్లిలో గ్రామీణ ఆరోగ్యం భవనం తీరే ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఇక్కడ రూ.20.80 లక్షల వ్యయంతో నిర్మించిన భవనం ఎందుకూ పనికి రాకుండా శిథిలావస్థకు చేరే పరిస్థితి ఉంది. ఈ ఏడాది జనవరి 13న అప్పటి ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు ప్రారంభించారు. కోడ్ వస్తుందనే కారణంతో హడావుడిగా చేశారు. భవనంలో మరుగుదొడ్డి, కరెంటు, తలుపులు ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇవేమీ చేయకుండానే 'రిబ్బన్' కట్ చేశారు. అసంపూర్తిగా భవనం ఉన్నా అదనపు నిధులు కావాల్సి ఉన్నా అప్పట్లో ఎవరూ పట్టించుకోలేదు. గ్రామానికి దూరంగా నిర్మించడంతో ఇక్కడ అసాంఘిక కార్యక్రమాలకు గ్రామీణ ఆరోగ్య కేంద్రం 'వసతి'గా మారింది. రూ.3.50 లక్షల నిధులకు అంచనాలు రూపొందించినా గత ప్రభుత్వ హయాంలో మంజూరు కాలేదనిపంచాయతీరాజ్ ఏఈ కృష్ణ తెలిపారు. గ్రామంలో అధిక శాతం గిరిజనులున్నారు. ఇక్కడ వైద్య సేవలు అత్యంత అవసరమైనా పట్టించుకునే నాథుడు కరవయ్యారు. ఇక్కడ ఆరోగ్య కేంద్రాన్ని అద్దె భవనంలో నిర్వహిస్తుండగా వసతి చాలడం లేదు.



విద్యుత్తు నియంత్రిక ఏర్పాటుపై నిరసన

కైకలూరు, న్యూస్‌టుడే: నిత్యం విద్యార్థులు సంచరించే పాఠశాల సమీపంలో విద్యుత్తు నియంత్రిక ఏర్పాటు చేయడం సరికాదని కైకలూరులోని వెలమపేట వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలనీలో అదనపు విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం కొన్ని రోజుల కిందట వెలమపేట ఎంపీపీ ప్రభుత్వ పాఠశాల ప్రహరీని ఆనుకుని విద్యుత్తు శాఖ అధికారులు సిమెంటు దిమ్మను నిర్మించారు. ఆ దిమ్మ చేతికందే ఎత్తులో ప్రమాదకరంగా ఉండటంతో విద్యార్థులతో కలిసి తల్లిదండ్రులు, గ్రామస్థులు శుక్రవారం మధ్యాహ్నం ఆందోళన నిర్వహించారు. పాఠశాలతో పాటు సమీపంలోనే అంగన్‌వాడీ కేంద్రం సైతం ఉండటంతో ప్రతి రోజూ వందకు పైగా విద్యార్థులు రాకపోకలు సాగిస్తూ, ఆటలు ఆడే ప్రదేశంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తే ప్రమాదాలు జరుగుతాయని వాపోయారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో పెట్టుకుని నియంత్రికను మరోచోట ఏర్పాటు చేయాలని విద్యుత్తుశాఖ అధికారులకు సూచించి నిరసన తెలిపారు. ఈక్రమంలో గ్రామ సర్పంచి దానం మేరీ నవరత్న కుమారి గ్రామస్థులకు మద్దతుగా నిరసనలో పాల్గొన్నారు.



కాలనీవాసులకు మద్దతు తెలుపుతున్న సర్పంచి

వేతన బకాయిలు చెల్లించాలని ఆందోళన

ముదినేపల్లి, న్యూస్‌టుడే: పాఠశాలల్లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు మూడు నెలల వేతన బకాయి వెంటనే చెల్లించాలని వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.విజయలక్ష్మి డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, ప్రతి నెలా 5వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మండల డీటీ పవన్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. మండల కమిటీ సభ్యులు నేతల విజయలక్ష్మి, వెంకట పద్మ పాల్గొన్నారు.



డీటీకి వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

కొనసాగిన తపాలా సిబ్బంది ధర్నా

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: నూజివీడు పట్టణం బ్యాంక్ స్ట్రీట్‌లోని పోస్ట్ ఆఫీస్ వద్ద గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ ఆధ్వర్యంలో సిబ్బంది నిరసన కార్యక్రమం శుక్రవారానికి మూడో రోజుకు చేరుకుంది. సంఘ కార్యదర్శి పి.నాగేశ్వరరావు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కారం అయ్యేవరకు నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయని స్పష్టంచేశారు. వచ్చే నెలలో దిల్లీ కేంద్రంగా తమ నిరసన కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో అధ్యక్షుడు వీవీఎస్ అజరయ్య, కోశాధికారి పార్థసారథి, అన్ని సబ్ పోస్ట్ ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

పక్షం రోజుల్లో ప్రతి అర్జీ పరిష్కారం

ముదినేపల్లి, న్యూస్‌టుడే: గ్రామ సభలో వచ్చిన ప్రతి అర్జీని పక్షం రోజుల్లోనే పరిష్కరిస్తామని తహసీల్దారు జె.సుభానీ తెలిపారు. ఊటుకూరు, వాడవల్లి, కాకరవాడలో శుక్రవారం భూ రీ సర్వే గ్రామసభలు నిర్వహించారు. రైతులు భారీగా తరలివచ్చి తమ సమస్యలను విన్నవించారు. రైతుల నుంచి 79 అర్జీలు స్వీకరించారు. దీంతో మండలంలోని గ్రామసభలు పూర్తయ్యాయి. సర్పంచి సుధాబత్తుల వరలక్ష్మి, వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: గతంలో రీ సర్వేలో జరిగిన తప్పులు సరి చేసుకోవడానికి ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని శాశ్వత పరిష్కారం పొందాలని తహసీల్దారు పీఎన్వీ ప్రసాద్ సూచించారు. ఆగిరిపల్లి మండలం చొప్పరమెట్లలో శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. ఇందులో 18 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దారు తెలిపారు. ల్యాండ్ సర్వే ఉప తహసీల్దారు పి.మరియన్న, మండల సర్వేయర్ గంగరాజు, ఆర్.ఐ.యూనస్ తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తు స్వీకరిస్తున్న ప్రసాద్

రీ సర్వేలో లోపాల సవరణ

ఆవకూరు (కలిదిండి), న్యూస్‌టుడే : రీ సర్వేలో చోటుచేసుకున్న లోపాలను సవరించడానికే గ్రామాల్లో సభలు ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దారు రామకృష్ణ తెలిపారు. ఆవకూరులో శుక్రవారం రీ సర్వే సభను నిర్వహించారు. 50 మంది రైతులు పలు సమస్యల పరిష్కారాన్ని కోరుతూ అర్జీలు అందించారు. గ్రామ పెద్దలు, ఆర్ఐ శ్యామల, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

ప్రాణాలు హరిస్తున్న సారా

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: నూతన ప్రభుత్వం ఏర్పడి కొత్త మద్యం పాలసీ వచ్చినా ఆగిరిపల్లి మండలంలో సారా ఏరులై పారుతోంది. నాటు సారా తాగి ప్రజలు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. మరో వైపు సారాకు బానిసలుగా మారి రహదారులపై పడిపోతున్నారు. తాజాగా శుక్రవారం సింగన్నగూడేనికి చెందిన పటాపంచల గోపాలకృష్ణ (35) నాటు సారాకు బలయ్యాడు. ఆగిరిపల్లి మండలంలో పలు గ్రామాల్లో పెద్ద ఎత్తున నాటు సారా అమ్మకాలు సాగుతున్నాయని, ఎక్సైజ్ పోలీసులు దృష్టి పెట్టి నాటు సారాను కట్టడి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు మండలం వలసపల్లి తమ్మిలేరు నుంచి అక్రమంగా తరలిస్తున్న 12 ఇసుక ట్రాక్టర్లను గురువారం రాత్రి ఎస్సై ఎం.చిరంజీవి పట్టుకుని జరిమానా నిమిత్తం ముసునూరు ఇన్‌ఛార్జి తహసీల్దార్ శర్మకు అప్పగించారు. శుక్రవారం తహసీల్దార్ ఒక్కొక్క ట్రాక్టర్‌కు రూ.2 వేలు చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉచిత ఇసుకను ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు ఇసుక తరలింపునకు అనుమతి ఉన్నట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమించి అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



వాహన చోదకుడికి మూడు నెలల జైలు

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: వ్యాను నిర్లక్ష్యంగా నడిపి ఓ వ్యక్తి మృతికి, మరో వ్యక్తి గాయాలకు కారకుడైన డ్రైవర్‌కు మూడు నెలల జైలు, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి శుక్రవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు 2018 జనవరి 20న పెదపాడు మండలం పెదారవీడు గ్రామానికి చెందిన కురుమ జాక్విన్, చెట్టుమాల భానులు తేలప్రోలులో వివాహానికి హాజరయ్యేందుకు బైక్‌పై ప్రయాణమయ్యారు. ఆరుగొలను గ్రామం చేరుకోగానే వేగంగా ఎదురుగా వచ్చిన వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న జాక్విన్ తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. భాను కాలు, చేతులకు గాయాలయ్యాయి. ఈ ప్రమాదానికి సంబంధించి హనుమాన్ జంక్షన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రకృతి సేద్యంతో మేలు

కైకలూరు, న్యూస్‌టుడే: వరి సాగులో సహజ సిద్ధ ప్రకృతి వనరులు వినియోగిస్తే పెట్టుబడి తగ్గి అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వనరులు కేంద్రం ఏడీఏ లలిత సుధ తెలిపారు. జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని వింజరంలో రైతులకు పంటల సాగుపై శిక్షణ నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ పంటల సాగులో క్రిమి సంహారక మందులు, రసాయనాల వాడకం తగ్గించుకొని మిత్ర పురుగులను సంరక్షించుకోవాలని సూచించారు. అనంతరం వరి సాగులో సమగ్ర పురుగులు, తెగుళ్ల నివారణకు అవలంబించాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. స్థానిక వ్యవసాయశాఖ అధికారులు రబీ సాగు సన్నద్ధత, ధాన్యం కొనుగోళ్ల గురించి రైతులకు అవగాహన కల్పించారు. కైకలూరు ఏడీఏ ఆర్.గంగాధరరావు, ఏవో దివ్య, గ్రామ సర్పంచి ధర్మరాజుల నాగమణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వనరుల కేంద్రం ఏడీఏ లలిత సుధ

ఒక్క చిన్నారీ లేని అంగన్‌వాడీ కేంద్రం

మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి మండలం చింతలపూడి గ్రామం అంగన్‌వాడీ 301లో ఒక్క చిన్నారీ లేకపోయినా ఇద్దరు ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. గ్రామంలో ఒక్క గర్భిణి మాత్రమే ఉన్నారు. ఈమె కోసం ఏకంగా ఒక అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహించడం గమనార్హం. ఈ నెల 15 వరకు అంగన్‌వాడీ కేంద్రానికి ఇద్దరు చిన్నారులు వచ్చేవారని, వాళ్లు కూడా ఇతర ప్రాంతాలకు వెళ్లి పోవడంతో ఖాళీగా మారింది. గ్రామంలో 460 మంది ఓటర్లు ఉన్నారు. మండల కేంద్రానికి గ్రామం దూరంగా ఉండటం, చుట్టూ ఉన్న పొలాలన్నీ చెరువులుగా మారిపోవడంతో పనులు లేక చాలామంది విజయవాడ, హైదరాబాద్ ప్రాంతాలకు వలసలు వెళ్లిపోయారు. దీంతో ప్రస్తుతం గ్రామంలో 50 ఇళ్లలో 174 మంది మాత్రమే నివశిస్తున్నారు. దీనిపై సీడీపీవో దీప్తిని వివరణ కోరగా.. సర్వేలో చిన్నారులు ఎవరూ లేరని తెలిపారు. ఈ అంగన్‌వాడీని అవసరం ఉన్న వేరే ప్రాంతానికి తరలిస్తామని చెప్పారు.



చింతలపూడి అంగన్‌వాడీలో..

నిత్యావసర సరకుల పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

చాట్రాయి, న్యూస్‌టుడే: నిత్యావసర సరకుల పంపిణీలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దారు ప్రశాంతి హెచ్చరించారు. చాట్రాయి తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం రేషన్ డీలర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిరుపేదలకు కందిపప్పు సక్రమంగా అందించాలని సూచించారు.

నిరంతర స్ఫూర్తి ప్రదాత సత్యనారాయణ

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే వంక సత్యనారాయణ నిరంతరం స్ఫూర్తిప్రదాతని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ కొనియాడారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో వంక సత్యనారాయణ ఆరో వర్ధంతి సభ శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సత్యనారాయణ విద్యార్థి దశ నుంచే ఉద్యమాలకు ఆకర్షితుడై, తాము నమ్మిన సిద్ధాంతాల కోసం చివరి శ్వాస వరకూ పోరాడారన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు చలసాని రామారావు, సీపీఐ జిల్లా కార్యదర్శి కృష్ణచైతన్య, నాయకులు కొండేటి బేబి, కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.